# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్: 9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 4-7-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 255 పేజీలు:6 వెల: రూ.1/-


## చురుకుగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు

ఉత్తరప్రదేశ్ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ముఖ్యంగా ఈశాన్యా రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. రాబోయే 5 రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి." అని వాతావరణ శాఖ సీనియర్ అధికారి నరేష్ కుమార్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో తూర్పు యూపీకి వాతావరణశాఖ హెచ్చరికలు పంపింది. అలాగే ఉత్తర బెంగాల్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో జూలై 2 నుంచి 7 మధ్య ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. డార్జిలింగ్, కాలింపాంగ్, జల్పాయిగురి, కూచ్‌బెహార్, అలీపుర్‌దువార్ జిల్లాలో ఉరుములతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని తెలిపింది. అదే సమయంలో ఉత్తర బెంగాల్‌లోని మిగిలిన జిల్లాలో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని పేర్కొంది.

## ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూ డిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం కొత్తగా ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఇకపై ఇందులోనే రాజకీయ పార్టీలు తమ ఆర్థిక వివరాలను వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక వివరాలతో పాటు పార్టీలకు సంబంధించిన ఎన్నికల ఖర్చులు, పార్టీకి వచ్చిన విరాళాలకు సంబంధించిన వివరాలను ఈ పోర్టల్ ద్వారా అందించవచ్చని చెప్పింది. దేశంలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. ఎలక్షన్ కమిషన్ ఈ పోర్టల్‌ను 3సీ వ్యూహంలో భాగంగా పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెప్పింది. అక్రమ నిధులను అరికట్టడం, రాజకీయ పార్టీల నిధులు, ఖర్చుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యం పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెప్పింది. తమ ఆర్థిక నివేదికను ఆన్‌లైన్‌లో ఇవ్వకూడదని భావిస్తే.. అందుకు గల కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలని, ఆన్‌లైన్‌లో సమర్పించకపోతే నిర్దేశించిన ఫార్మాట్‌లో సీడీలు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ కాపీ ఫార్మాట్‌లో నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో ఆర్థిక నివేదికలను దాఖలు చేయనందుకు పార్టీ పంపిన సమర్థన లేఖతో పాటు అలాంటి అన్ని నివేదికలను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తుందని ఈసీ పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 మరియు కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ఆర్థిక నివేదికలను రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

## మైక్రోచిప్ టెక్నాలజీ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన కేటీఆర్



హైదరాబాద్ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );కోకాపేటలో మైక్రోచిప్ టెక్నాలజీ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇవాళ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నాస్కామ్ ప్రకారం గత రెండేళ్లలో టెక్నాలజీ రంగంలో మూడో వంతు ఉద్యోగాలు హైదరాబాద్‌లోనే సృష్టించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామని మంత్రి కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నదని చెప్పారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో హైదరాబాద్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు. దేశానికి లైఫ్ సైన్సెస్ రాజధానిగా ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఉందని వెల్లడించారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ తన వర్క్‌ఫోర్స్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ ఇప్పుడిప్పుడే వృద్ధి చెందుతోందన్నారు. వచ్చే దశాబ్దంలో ఆ రంగంలో భారత్ దూసుకెళ్తుందన్న విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ఆ ప్రక్రియలో హైదరాబాద్ నగరం కీలక పాత్ర పోషించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం వెయ్యి మందికి స్వంత ఖర్చులతో శిక్షణ ఇస్తోందన్నారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కిలింగ్ రంగంలో కూడా తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోందన్నారు.

## సుప్రీంకోర్టు మరో ముందడుగు..

### –73 ఏళ్ల న్యాయవ్యవస్థ చరిత్రలోనే తొలిసారిగా.. డిజిటలైజేషన్

న్యూ ఢిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్): సుప్రీంకోర్టులో డిజిటలైజేషన్ దిశగా మరో ముందడుగు పడింది. నేటి నుంచి మూడు కోర్టులు పూర్తిగా పేపర్‌లెస్ గ్రీన్ హైటెక్ విధానాన్ని అమలు చేయనున్నాయి. 73 ఏళ్ల చరిత్రలో న్యాయవ్యవస్థలో పూర్తిగా పేపర్‌లెస్‌గా మారడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోర్టు హాల్‌లో సైతం గత 50 ఏళ్ల సుప్రీంకోర్టు తీర్పు కాపీలను తొలగించనున్నారు. అన్ని ఫైళ్లను డిజిటల్ మాధ్యమాల ద్వారా చూసే వెసులుబాటు కల్పించనున్నారు.

## విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిని కలిసి వినతి పత్రం అందజేసిన PDSU రాష్ట్ర కమిటీ



హైదరాబాద్, జులై 3:రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలపై ముఖ్యంగా బీటెక్ ఇంజనీరింగ్ ఆర్18 విద్యార్థులకు గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా 8 క్రెడిట్స్ సబ్జెక్ట్ మినహాయింపు సదుపాయాన్ని కల్పించాలని పి.డి.యస్.యు రాష్ట్ర కమిటీ నేతృత్వంలో సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత 25 సంవత్సరాలుగా ఈ 8 క్రెడిట్స్ విధానాన్ని అమలు చేసి ప్రస్తుతం తీసేయడంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోతారని ఏఐసీటీఈ అకడమిక్ రూల్ ప్రకారం ఒక విద్యార్థి ఇంజనీరింగ్ లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పొందడానికి 150 నుంచి 160 క్రెడిట్ల శ్రేణిని పొందాలని స్పష్టంగా ఉందని పీడీఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు మహేష్ తెలిపారు. జేఎన్టీ యూహెచ్ గతంలో ఉన్న ఆర్ 07 నుంచి ఆర్ 16 వరకు అందరికీ మినహాయింపు ఇచ్చి ఇప్పుడు ఆర్18 విద్యార్థులకు మినహాయింపును ఇవ్వట్లేదని తెలిపారు. ఆర్18 విభాగంలో ఉన్న విద్యార్థులు పరీక్షలను ఒకే సంవత్సరంలో మూడు సెమిస్టర్లు రాయాల్సి వచ్చిందని పరీక్షలను టైమ్ టేబుల్కు అనుగుణంగా ఉంచ డానికి హడావుడిగా నిర్వహించారని తెలిపారు. ఆర్18 విభాగంలో చాలా మంది విద్యార్థులకు సగానికి పైగా ఆన్లైన్ మోడ్ ద్వారానే పరీక్ష జరిగిందని దీంతో చాలా మంది విద్యార్థులు కనెక్టివిటీ సమస్యలు ఎదు ర్కొన్నారని తెలిపారు. చైర్మెన్ ను కలిసిన వారిలో పీడీఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్నారం రాజేశ్వర్, టియు సెక్రటరీ సంతోష్, హైదరాబాద్ సెక్రటరీ శ్రీనివాస్, తదితర విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

## జూలై 13వ తేదీన చంద్రయాణ్-3ని ప్రయోగం



న్యూఢిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: చంద్రయాణ్–3 మిషన్‌ను ఈనెల 13వ తేదీన ప్రయోగించనున్నారు. ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ ఇవాళ ఆ విషయాన్ని తెలిపారు. జూలై 13వ తేదీన చంద్రయాణ్–3ని ప్రయోగించాలనుకుంటున్నామని, అయితే జూలై 19వ తేదీ వరకు తేదీని పొడిగించే అవకాశం ఉందన్నారు. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జీఎస్ఎల్వీ మార్క్–3 రాకెట్ ద్వారా చంద్రయాణ్–3ని పంపనున్నారు. ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనా దేశాలు మాత్రమే స్పేస్‌క్రాఫ్ట్‌ను మూన్ సర్ఫేస్‌పై దించాయి. అయితే ఆ మైలురాయిని అందుకోనున్న నాలుగవ దేశంగా ఇండియా మారనున్నది. చంద్రుడిపై ఉన్న చీకటి ప్రదేశంలో చంద్రయాణ్–3 రోవర్ ల్యాండ్ అవుతుంది. 14 రోజుల పాటు పనిచేసే విధంగా మూన్ మిషన్‌ను డిజైన్ చేశారు.

## ఉస్మానియా ఆస్పత్రి నూతన నిర్మాణానికి ప్రజాప్రతినిధుల ఏకగ్రీవ అభిప్రాయం



హైదరాబాద్, జులై 3:ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రి నూతన నిర్మాణానికి ప్రజాప్రతినిధుల ఏకగ్రీవ అభిప్రాయం జరిగింది అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన నిర్మాణ అంశంపై ఆస్పత్రి పరిధిలోని ప్రజా ప్రతినిధులతో మంత్రి హరీశ్ రావు ఆధ్వర్యంలో సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజల వైద్య అవసరాల కోసం పాత భవనాలు తొలగించి అయినా నిర్మాణాలు చేపట్టాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిశీలించి, అఫిడవిట్ రూపంలో హైకోర్టుకు తెలియ చేస్తుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. హైకోర్టు నుండి అనుమతి రాగానే వెంటనే నూతన భవన నిర్మాణం చేపడతామని మంత్రి వెల్లడించారు.

ప్రజల భవిష్యత్ అవసరాలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే నాలుగు టిమ్స్, నిమ్స్ విస్తరణ, నూవర్ స్పెషాలిటీ ఎంసీహెచ్‌ల నిర్మాణం చేపట్టిందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. సీఎం కేసీఆర్ 2015 లోనే ఉస్మానియా ఆస్పత్రి సందర్శించి, కొత్త భవన నిర్మాణానికి ఆదేశించినట్లు గుర్తు చేశారు. తదనంతరం నిర్మాణం కూల్చవద్దని కొందరు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు స్టే ఇచ్చిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు వేసిన ఐఐటి హైదరాబాద్ నిపుణుల కమిటీ కూడా ఆస్పత్రి అవసరాలకు ఈ భవనం పని చేయదని చెప్పిందని వివరించారు. తదుపరి కోర్టు ఆదేశాల ప్రకారం సోమవారం ఆస్పత్రి పరిధిలోని ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. కొత్త భవనం నిర్మాణానికి ప్రజాప్రతినిధులు అందరూ ఏకగ్రీవంగా అంగీకరించడం సంతోషకరం అన్నారు. హైకోర్టు తుది తీర్పు మేరకు కొత్త నిర్మాణం త్వరలో చేపడతామని హరీశ్‌రావు తెలిపారు.

ఈ సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, వాణీ దేవి, రహమత్ బెగ్, హసన్ ఎఫెండి, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, దానం నాగేందర్, గోపీనాథ్, జాఫర్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, హెల్త్ సెక్రెటరీ రిజ్వీ, సీఎం ఓఎస్డీ గంగాధర్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఈఎన్‌సీ గణపతి రెడ్డి, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని అధికారం నుంచి దించడమే అందరి లక్ష్యం : అఖిలేష్ యాదవ్

హైదరాబాద్, జులై 3: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీని గద్దె దింపాలంటే విపక్షాలన్నీ ఏకం కావాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశం నిమిత్తం హైదరాబాద్ చేరుకున్న అఖిలేష్ యాదవ్.. బేగంపేట ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు.

భారతీయ జనతా పార్టీని గద్దె దించడమే విపక్షాల లక్ష్యం అని అఖిలేష్ ఉద్ఘాటించారు. బీజేపీ వ్యతిరేకులను కలుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విపక్షాల పోరాటంపై కేసీఆర్‌తో చర్చించేందుకు వచ్చానని తెలిపారు. అందరి లక్ష్యం కూడా బీజేపీని అధికారం నుంచి దించడమే అని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో భేటీ తర్వాత అన్ని విషయాలు మాట్లాడుతాను అని అఖిలేష్ వెల్లడించారు.

## రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదు : మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, జులై 3: కాంగ్రెస్ నేత రాహుల్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడకుండా, రాసిచ్చిన స్క్రిప్ట్‌తో మాట్లాడారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం మీడియా సెంటర్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. రాహుల్, కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు.

కాంగ్రెస్ పార్టీలో ప్రధాన నాయకుడైన రాహుల్ గాంధీ పూర్తిగా అవగాహన రాహిత్యంతో మాట్లాడారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి రాహుల్ గాంధీ మాట్లాడడం హాస్యాస్పదమని విమర్శించారు. మూడేళ్ల రికార్డ్ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి రాష్ట్ర రైతాంగానికి సాగునీటి అందిస్తున్నామని, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ జీవనాధారమని, ఒకనాడు కరువుతో అల్లాడిన రాష్ట్రం నేడు సస్యశ్యామలమైందంటే అందుకు ఆ ప్రాజెక్టే కారమణమని కొనియాడారు. అలాంటి ప్రాజెక్టుపై రాహుల్‌గాంధీ అడ్డగోలుగా మాట్లాడడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని కొప్పుల ఈశ్వర్ వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెన్షన్లు ఇవ్వలేని వారు తెలంగాణలో రూ. 4 వేల పెన్షన్ ఇస్తామనడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో పోడు భూముల పంపిణీ కొనసాగుతున్నదని, అయినా అధికారంలోకి వచ్చి పట్టాలు పంపిణీ చేస్తామనడం రాహుల్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇక ఎవరికి ఎవరు బీ టీమో తెలంగాణ ప్రజలందరికీ తెలుసని, హుజురాబాద్, మునుగోడు ఎన్నికలే నిదర్శనమని పేర్కొన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీని అరెస్ట్ చేస్తారని చెప్పి చేయలేదని, దాన్ని బట్టే బీ టీం ఎవరో అర్థమవుతుందని కొప్పుల ఈశ్వర్ ఎద్దేవా చేశారు. కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, గురుకుల పాఠశాలలు ఎందుకు మీరు అధికారంలో ఉన్న రాష్ట్రంలో అమలు చేయడం లేదని, తెలంగాణలో మీ మాటలు నమ్మేవారు ఎవరూ లేరని వివరించారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నాయకుడు భట్టి విక్రమార్కను వేదిక మీదనే తోసివేసి పీసీసీ నాయకుడు రేవంత్‌రెడ్డి తన సంస్కారాన్ని మరోసారి బయటపెట్టుకున్నాడని మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఇకనైనా విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు.

## శ్రీశైలంలో సంప్రదాయంగా శాకంబరీ ఉత్సవం

అమరావతి, జులై 3: ఆషాడ పౌర్ణమి సందర్భంగా శ్రీశైలంలో సోమవారం (03-07-2023) శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి శాకంబరీ ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం సందర్భంగా ఆకు కూరలు, కూరగాయలు, వివిధ రకాల పండ్లతో శ్రీ భ్రమరాంబా దేవి మూల మూర్తిని, ఉత్సవ మూర్తిని, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి, అన్నపూర్ణాదేవి అమ్మవారికి, గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి అర్చకులు, వేద పండితులు శాకాలంకరణ, ఉత్సవ సంబంధ పూజాధికాలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగానే అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పలు రకాల ఆకు కూరలతో అలంకరించారు. ఇందుకోసం వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల ఫలాలు తెప్పించారు.

వంగ, దొండ, బెండ, కాకర, చిక్కుడు, గోరు చిక్కుడు, మునగ, సొర, బీర, గుమ్మడి, బంగాళాదుంప, కంద దుంప, క్యాప్సికమ్ (బెంగళూరు మిరప), క్యాబేజీ, బీన్స్, క్యారెట్, అరటి తదితర వివిధ రకాల కూరగాయలు, తోటకూర, పాలకూర, మెంతి కూర, చుక్క కూర వంటి ఆకుకూరలు, కరివేపాకు, కొత్తిమీర వంటి సుగంధ పత్రాలు, కమలాలు, బత్తాయి, ఆపిల్, అరటి, పనస తదితర పలు రకాల ఫలాలు, నిమ్మకాయలు, బాదంకాయలు, పచ్చి శనగలు తెప్పించారు.

ఈ ఉత్సవంలో భాగంగా ఆగమశాస్త్రానుసారంగా శ్రీభ్రమరాంబాదేవి వారికి ఉత్సవ సంబంధ పూజాధికాలు నిర్వహించారు. ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు, వేద పండితులు ఉత్సవ సంకల్పం పఠించారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, అతి వృష్టి, అనావృష్టి నివారించాలని, అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలను నిరోధించి జనులంతా సుఖ సంతోషాలతో ఉండాలని సంకల్పం పఠించారు.

ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగేందుకు మహా గణపతి పూజ చేశారు. ఉత్సవంలో భాగంగానే శాకంబరీ దేవిగా అలంకరించిన అమ్మవారి ఉత్సవ మూర్తికి కూడా విశేషంగా షోడశోపచార పూజలు చేశారు.

పూర్వం హిరణ్యాక్షుడి వంశానికి చెందిన దుర్గముడు అనే రాక్షసుడు తన తపశ్శక్తితో వేదాలను అంతర్ధానం చేశాడు. దీంతో యజ్ఞ యాగాధులు నిలిచిపోయాయి. కరువు కాటకాలతో తీవ్ర క్షామం ఏర్పడింది. అప్పుడు మహర్షులంతా ఆది పరాశక్తిని గురించి తపస్సు చేశారు. వారి తపస్సుకు ప్రసన్నురాలైన ఆది పరాశక్తి.. లోక రక్షణ కోసం దుర్గముడిని సంహరించి, వేదాలు రక్షించి వైదిక కర్మలను పునరుద్ధరించింది. ఈ సందర్భంగానే జగన్మాత తన నుంచి పలు రకాల ఆకు కూరలు, కూరగాయలు, ఫలాలు తదితర శాకాలను సృష్టించి క్షామాన్ని నివారించింది. ఇలా అవతరించిన అమ్మవారి స్వరూపమే శాకంభరీ దేవి

## ఆరేండ్లలో అరవై ఏండ్ల అభివృద్ధి.. అద్భుతాలు సృష్టించిన సీఎం కేసీఆర్ : మంత్రి జగదీశ్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, జులై 3: ఆరేండ్లలో అరవై ఏండ్ల పురోగతిని సాధించి పెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో కనీస అవసరాలు సురక్షితమైన మంచినీరు, పర్యావరణ పరిశుభ్రత, రవాణా సౌకర్యం, విద్య, వైద్య వంటి ప్రాథమిక అవసరాలు తీర్చలేక పోయారని ఆయన పేర్కొన్నారు. పైగా అన్నింటికి మించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాటి పాలకులు ఫ్లోరోసిస్ పాపాన్ని పెంచి పోషించారని ఆయన ఆరోపించారు. అటువంటి శాపం నుండి ఆరు సంవత్సరాల వ్యవధిలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ విముక్తి కల్పించారని తెలిపారు.

సోమవారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గిరిజన భూమి పుత్రులకు మంత్రి జగదీశ్ రెడ్డి పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని చౌటుప్పల్, తుర్కపల్లి, నారాయణపురం మండలాల్లోని తొమ్మిది గ్రామాలకు చెందిన 205 మంది లబ్ధిదారులకు 213 ఎకరాల భూమికి ఆయన పట్టాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గిరిజనులు, గోండులు, అడవిబిడ్డల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. పోడు భూముల పట్టాలు అందుకున్న గిరిజన రైతాంగానికి తక్షణమే రైతు బంధు పథకం అమలులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. పాలనలో అద్భుతాలు సృష్టించిన నేతగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోతారని ఆయన కొనియాడారు. తాండాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమైనదని ఆయన పేర్కొన్నారు.

తద్వారా తండాలలో వెలుగులు విరజిమ్ముతున్నాయన్నారు. 2001 నాటి పరిస్థితులను అధ్యయనం చేసిన మీదట ఇక్కడి ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్ర సాధన ఉద్యమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. సాధించిన రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందే తడవుగా నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీరు, త్రాగునీరు, కళ్యాణాలక్ష్మి/షాదీముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలను అమలు చేశారని మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు.

## బోటు రేస్‌లో విషాదం : 25 మంది మహిళలతో వెళుతున్న పడవ బోల్తా

తిరువనంతపురం, జులై 3: కేరళలో విషాదం చోటుచేసుకుంది. సోమవారం సరదాగా మొదలైన బోట్ రేస్ విషాదాన్ని మిగిల్చింది. పడవల పోటీలో 25 మంది మహిళలను ఎక్కించుకుని వెళుతున్న ఓ పడవ నీట మునగడంతో మహిళల ఆచూకీ గల్లంతైంది.

పడవ బోల్తా పడటంతో ఈ ప్రాంతంలో జరుగుతున్న ఇతర బోట్ రేసులన్నింటినీ నిలిపివేశారు. గజ ఈతగాళ్లను రంగంలోకి దించి సహాయ కార్యక్రమాలను అధికారులు వేగవంతం చేశారు. పడవలో ప్రయాణిస్తున్న మహిళల క్షేమ సమాచారం కోసం కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

గాలింపు చర్యలను ముమ్మరంగా చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు. కేరళలోని అలప్పుజలో ఈ ఘటన జరిగింది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

### నేటి కందం– నేటికి అందం


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం


కం॥ వీరుల యోధుల ఫలమ్ముగ
పోరున వచ్చిన విబుధుల పుణ్యమ్మునగన
భారత స్వాతంత్ర్యమునకు
తోరపు చట్టమ్ము నాడిన దినమును గాంచుమున్ !!

(జులై 4 భారత స్వాతంత్ర్య చట్టం బ్రిటీష్ పార్లమెంటు దిగువ సభలో ప్రవేశపెట్టిన రోజు...)



–రాధశ్రీ

సెల్:9494481210




# అమెరికా సంయుక్త రాష్ట్రాల 247వ పుట్టిన రోజు?!

## (04 జూలై 'అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం' సందర్భంగా)

ఇంగ్లాండ్ పాలనలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాలు చేపట్టిన అమెరికన్ విప్లవం ఫలితంగా 04 జూలై 1776న స్వాతంత్ర్యాన్ని పొంది స్వేచ్ఛా గాలులు పీల్చడం జరిగింది. ఈ మహాఘట్టాన్ని పురస్కరించుకొని 04/05 జూలై రోజున అమెరికాలోని 50 సంయుక్త రాష్ట్రాలు సెలవు దినాన్ని పాటిస్తున్నాయి. 1812 జరిగిన యుద్ధానంతరం 'యుయస్ ఇండిపెండెన్స్ డే' వేడుకలను ఘనంగా పాటించటం ప్రారంభించారు. 1870 తరువాత స్వాతంత్ర్య దినం రోజున ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా పాటించుట జరుగుతున్నది. ఈ ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా కవాతులు, వినోదాలు, సభలు, సమావేశాలు, క్రీడలు, కుటుంబ కలయికలు, బాణాసంచాల జిలుగు వెలుగులు, విహార యాత్రలు లాంటి వేడుకల్లో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొంటూ సంబరాల్లో మునిగి తేలుతారు.

### 04 జూలై – అమెరికా పుట్టిన రోజు:

అప్పటి వరకు బ్రిటన్‌కు చెందిన 'కింగ్ జార్జ్ – 3' చక్రవర్తి పాలనలో 13 అమెరికన్ కాలనీలు ఉండేవి. నాటి బ్రిటన్ పాలనలోని అమెరికన్ ఖండపు కాంగ్రెస్ 02 జూన్ 1776న స్వాతంత్ర్య ప్రకటనకు సంబంధించిన తీర్మానం చేసినప్పటికీ 04 జూలైన మాత్రమే స్వాతంత్ర్య ప్రకటనపై సంతకాలు చేయడంతో అమెరికా పుట్టిన రోజు"గా పాటించుట జరిగింది. 'థామస్ జఫెర్సన్' నాయకత్వంలో ఏర్పడిన ఐదుగురు సభ్యుల కమిటీ స్వాతంత్ర్య ప్రకటనను తయారు చేశారు. ఈ కమిటీలోని థామస్ జఫెర్సన్, జాన్ ఆడమ్స్, బెంజిమన్ ఫ్రాంక్లిన్ ఒక వైపు, ఇంగ్లాండ్ పాలకులు మరో వైపు ఏకగ్రీవంగా స్వాతంత్ర్య ప్రకటనపై సంతకం చేయడం జరిగింది.

### జార్జ్ వాషింగ్టన్ – అమెరికా జాతిపిత:

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటన్ చక్రవర్తి పాలనలో అమెరికన్లు దుర్భర బానిసలుగా బతకడం జరిగిందని, 'జార్జ్ వాషింగ్టన్' నేతృత్వంలో స్వాతంత్ర్యం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని చరిత్ర వివరిస్తున్నది. ఈ కారణంగానే తనదైన అమెరికన్ రాజ్యాంగంతో పాలన చేసిన తొలి అధ్యక్షుడు (1789–1797) జార్జ్ వాషింగ్టన్‌ను 'అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతి పిత ( ఫాదర్ ఆఫ్ యుయస్)'గా పిలవడం జరుగుతున్నది. తనకంటూ ఒక అమెరికన్ రాజ్యాంగం లేకుండానే 1776 నుంచి 1789 వరకు ఎనిమిది మంది అధ్యక్షులు సేవలు అందించారు. 1787లో ఏర్పడిన అమెరికా రాజ్యాంగ రచన చేసిన కమిటీకి జార్జ్ వాషింగ్టన్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ ప్రధాన భూమికను నిర్వహించారు. 'డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్' ప్రకటనపై సంతకాలు చేసిన థామస్ జఫర్సన్, జాన్ ఆడమ్స్‌లు అనంతరం అమెరికా అధ్యక్షులుగా పని చేయడమే కాకుండా ఇద్దరు 50వ స్వాతంత్ర్య వేడుకలు జరుగుతున్న రోజు 04 జూలై 1826న తుది శ్వాస విడవడం జరిగింది. అదే విధంగా మరో అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో కూడా 04 జూలై 1831న తుది శ్వాస విడవడం జరిగింది. 04 జూలై 1872న జన్మించిన కెల్విన్ కూలిడ్జ్ కూడా యుయస్ అధ్యక్షుడిగా పని చేశారు.

### అమెరికా 46వ అధ్యక్షుడిగా జో బైడెన్:

స్వాతంత్ర్యం పొందిన అమెరికాకు 46వ అధ్యక్షుడిగా నేడు జో బైడెన్ సేవలను అందించుట మనకు తెలుసు. 1776కు పూర్వం నేటి అమెరికా సంయుక్త రాష్ట్రాలను 'కాంటినెంటల్ కాంగ్రెస్'గా పిలిచేవారు. జార్జ్ వాషింగ్టన్ ప్రభుత్వం హయాంలో 1792లో ప్రారంభమైన 'వైట్ హౌజ్' నిర్మాణం 1800 వరకు కొనసాగింది. శ్వేతసౌధంలో అడుగిడిన తొలి అధ్యక్షుడిగా 'జాన్ ఆడమ్స్' చరిత్రలో నిలిచారు.



నేడు అమెరికా పౌరసమాజం 247వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న శుభ గడియల్లో మనందరం శుభాకాంక్షలు తెలియజేద్దాం. 'హాపీ ఇండిపెండెన్స్ డే టు అమెరికన్స్'.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# జిల్లా గణాంకదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, జూలై,03 (నేటి నిజం ప్రతినిధి) జిల్లా గణాంక దర్శిని 2021–2022 పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక ,ఆర్థిక ప్రణాళిక విధాన రూపకల్పనలో జనం కాల పాత్ర ముఖ్యమైనదన్నారు.

రోజువారి జీవితంలో గణాంకాల వాడకం విధానాలను రూపొందించటలో గణాంకాలు దోహదపడతాయని తెలిపారు. జిల్లా గణాంక దర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, నీటి వనరులు, పంటలు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, లోకల్ బాడీ, ఇండస్ట్రీస్ సోషల్ సెక్యూరిటీ కి సంబంధించిన అంశాలు వివరంగా ఉంటాయని తెలిపారు. గణాంక దర్శినిలో అన్ని శాఖల జిల్లా గణాంక వివరాలు పొందుపరచడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి మనోహర్, ఆర్డీఓలు,తహశీల్దార్లు,సి పి ఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 3 నుండి 7 వరకు కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్రలలో పర్యటించనున్న భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జులై 3:భారత రాష్ట్రపతి, శ్రీమతి ద్రౌపది ముర్ము జూలై 3 నుండి 7, 2023 వరకు కర్ణాటక, తెలంగాణ మరియు మహారాష్ట్రలలో పర్యటించనున్నారు. జులై 3, 2023న, కర్ణాటకలోని ముద్దెనహళ్లిలో శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ 2వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొననున్నారు. సాయంత్రం కర్ణాటక రాజ్‌భవన్‌లో పీవీటీజీ సభ్యులతో కూడా రాష్ట్రపతి ముచ్చటించనున్నారు. జూలై 4, 2023న, రాష్ట్రపతి హైదరాబాద్‌లో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. జూలై 5, 2023న, గోండ్వానా విశ్వవిద్యాలయం యొక్క 10వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ప్రసంగిస్తారు. నాగ్‌పూర్‌లోని కోరడిలో భారతీయ విద్యాభవన్ యొక్క సాంస్కృతిక కేంద్రాన్ని కూడా ప్రారంభించనున్నారు. జూలై 6, 2023న, రాష్ట్రపతి నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో పీవీటీజీసభ్యులతో సంభాషిస్తారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆమె గౌరవార్థం ముంబయిలోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన పౌర విందుకు రాష్ట్రపతి హాజరవుతారు.

# బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయంకు ధరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి.

### -పోడు పట్టాల పంపిణీకి సిద్దం చేయాలి.
### - రెండవ విడత దళిత బంధు పథకంలో లబ్ధిదారులను గుర్తించాలి.
### – జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.



సంగారెడ్డి, జూలై 03(నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో గుర్తించిన లబ్ధిదారులకు పోడు పట్టాలను పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శరత్ వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోడు పట్టాల పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సంబంధించిన పట్టాదారు పాస్ బుక్స్ మంత్రి చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు పట్టాలు అందించడం మొదలుకొని కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయ్యేలా ప్రణాళికతో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు.

ఈ పథకంలో ఒక్కో లబ్ధి దారుకు 3 లక్షలు ఇస్తారని, వంద శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. అర్హులైన కుటుంబంలోని మహిళల పేరుపై గృహలక్ష్మి ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఇల్లు లేని నిరుపేదలు ఈ పథకానికి అర్హులన్నారు. అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయంకు ధరఖాస్తుల ఆన్లైన్ పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారికి తెలిపారు.

హరితహారం జిల్లా టార్గెట్ ను ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు.

రెండవ విడత గొర్రెల పంపిణీ త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు.

కస్టం మిల్లింగ్ రైస్ వేగవంతంగా ఎఫ్ సి ఐ కి డెలివరీ చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారికి సూచించారు.

మన ఊరు మన బడి కింద చేపట్టిన పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని సంబందితులకు సూచించారు.

రెండవ విడత దళిత బంధు పథకంలో లబ్ధిదారులను గుర్తించాలని, ఆయా ప్రక్రియ వేగవంతం చేయాలని, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులను నియామకం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో గల వైకుంఠధామాలకు నీటి వసతి, విద్యుత్ సౌకర్యాన్ని వంద శాతం ఏర్పాటు చేయాలని డి పి ఓ కు తెలిపారు. 647 జీ పిలలో నీటి వసతి ఏర్పాటు చేశామని, 636 జిపి లలో విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందని,11 గ్రామ పంచాయతీల లో రెండు మూడు రోజుల్లో గా పూర్తవుతుందని డిపిఓ తెలిపారు. పి హెచ్ సి సబ్ సెంటర్ భవన నిర్మాణాలకు వంద శాతం గ్రౌండింగ్ పూర్తి కావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డి ఆర్ డి ఓ, జడ్పీ సీఈవో, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యా ,వైద్యం, పశుసంవర్ధక శాఖల జిల్లా అధికారులు, డి ఆర్ ఓ నగేష్,ఆర్డీఓ లు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ మ్యూజియంలో ఆషాఢ పూర్ణిమ

న్యూఢిల్లీ, జులై 3:కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య (ఐబిసి) 2023 జూలై 3 న ఆషాఢ పూర్ణిమను నేషనల్ మ్యూజియం, జనపథ్, న్యూఢిల్లీలో నిర్వహిస్తుంది. ధర్మ చక్ర ప్రవర్తన దివస్‌గా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతి ఏడాది ఒక ముఖ్యమైన కార్యక్రమంగా ఆషాఢ పూర్ణిమ కార్యక్రమం నిర్వహిస్తుంది. బుద్ధ పూర్ణిమ లేదా వైశాఖ పూర్ణిమ తర్వాత బౌద్ధులకు రెండవ అత్యంత పవిత్రమైన రోజు ఆషాఢ పూర్ణిమ. ఆషాఢ పూర్ణిమ సందర్భంగా రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం చేస్తారు. లుంబినీ (నేపాల్)లో ఐబిసి అమలు చేస్తున్న ప్రత్యేక ప్రాజెక్ట్ – "ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ బుద్ధిస్ట్ కల్చర్ అండ్ హెరిటేజ్ "పై ప్రసారం చేసే చలన చిత్రం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గత సంవత్సరం బుద్ధ పూర్ణిమ నాడు నేపాల్‌లోని లుంబినీలో ఈ కేంద్రానికి శంకుస్థాపన చేశారు.

ఆషాఢ పూర్ణిమ విశిష్టతను మతపెద్ద 12వ చామ్‌గోన్ కెంటింగ్ తై సితుపా తన ధర్మ ప్రసంగంలో వివరిస్తారు. సాంస్కృతిక విదేశీ వ్యవహారాల మంత్రి శ్రీమతి మీనాక్షీ లేఖి కార్యక్రమంలో ప్రసంగిస్తారు. అనేక ఇతర ప్రముఖులు, బౌద్ధ సంఘాల అధిపతులు,పండితులు, న్యూఢిల్లీలో ఉన్న దౌత్య కార్యాలయాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

భారతదేశ చారిత్రక వారసత్వం, బుద్ధుని జ్ఞానోదయం, ఆయన ధర్మ బోధలు, మహాపరినిర్వాణానికి అనుగుణంగా ఐబిసి ఆషాఢ పూర్ణిమ వేడుకలను జాతీయ మ్యూజియం, జనపథ్‌లో నిర్వహిస్తోంది, ఇక్కడ సఖ్యముని పవిత్ర అవశేషాలు ఉన్నాయి.

సారనాథ్ వద్ద బుద్ధుడు మొదటి సారి ధర్మ బోధన చేశారు. ఇక్కడ నుంచి ధర్మ చక్రం ప్రయాణం ప్రారంభం అయ్యింది. భారతీయ చాంద్రమానం ప్రకారం ఆషాఢ మాసం పౌర్ణమి రోజున వచ్చే ఆషాఢ పూర్ణిమను శ్రీలంకలో ఎసల పోయగా, థాయిలాండ్‌లో అసన్హాబుచాగా పాటిస్తారు. . ఆషాఢ పౌర్ణమి రోజున భారతదేశంలోని వారణాసికి సమీపంలో ఉన్న ప్రస్తుత సారనాథ్ లోని షిషిపతన మృగదయంలోని 'డీర్ పార్క్'లో జ్ఞానోదయం పొందిన తర్వాత బుద్ధ భగవానుడు తన మొదటి ఐదుగురు సన్యాసి శిష్యులకు (పంచవర్గీయ) జ్ఞాన ప్రబోధం చేశారు.

సన్యాసులు, సన్యాసినుల కోసం వర్షాకాలం తిరోగమనం (వర్ష వస్సా) కూడా జూలై నుంచి అక్టోబర్ వరకు మూడు చాంద్రమాన నెలల పాటు ఈ రోజుతో ప్రారంభమవుతుంది, ఈ సమయంలో వారు ఒకే స్థలంలో నివసిస్తారు. సాధారణంగా దేవాలయాలలో ధ్యానంలో నిమగ్నం అవుతారు. ఈ రోజును బౌద్ధులు, హిందువులు తమ గురువులను గౌరవించే రోజుగా గురు పూర్ణిమ గా పాటిస్తారు.

# ఈ నెల 4న అసోంలో పర్యటించనున్న ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జులై 3:భారత ఉప రాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్‌ఖర్, ఈ నెల 04న అసోంలో పర్యటించనున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గౌహతి 25వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు. ఉప రాష్ట్రపతి గౌహతి చేరుకున్నాక కామాఖ్య ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ఒక రోజు పర్యటనలో భాగంగా, ఐఐటీ గౌహతిలో విద్యార్థుల తోనూ ఉప రాష్ట్రపతి సంభాషిస్తారు.

# మిషన్ గగన్‌యాన్ - శిక్షణను పూర్తి చేసుకున్న సిబ్బంది మాడ్యూల్ రికవరీ డైవర్ల తొలి దళం

న్యూఢిల్లీ, జులై 3:మిషన్ గగన్ యాన్ మొదటి జట్టు సిబ్బంది రికవరీ బృందం కొచ్చిలోని భారతీయ నావికాదళ వాటర్ సర్వైవల్ ట్రైనింగ్ ఫెసిలిటీ (డబ్ల్యుఎస్ టి ఎఫ్) నీటి మనుగడ శిక్షణా కేంద్రం లో మొదటి దశ శిక్షణను పూర్తి చేసుకుంది. అత్యాధునిక కేంద్రాన్ని ఉపయోగించుకుని, భారతీయ నావికాదళ డైవర్లు (గజ ఈతగాళ్ళు) నావికాదళ కమెండోలు వివిధ సముద్ర పరిస్థితుల్లో సిబ్బంది మాడ్యూల్‌కు సంబంధించిన రికవరీ శిక్షణను పొందారు. మిషన్ నిర్వహణ, అత్యవసర వైద్యపరిస్థితుల్లో తీసుకోవలసిన చర్యలు, భిన్న విమానాలు, వాటి రక్షణ పరికరాల పరిచయం గురించి రెండువారాల శిక్షణా క్యాప్సూల్‌లో క్లుప్తంగా వారికి వివరించడం జరిగింది. భారతీయ నావికాదళం, ఇస్రో ఉమ్మడిగా రూపొందించిన ప్రామాణిక, కార్యవిధాన పద్ధతలను శిక్షణ ధృవీకరించింది. ముగింపు రోజున, రికవరీ ప్రదర్శనను వీక్షించి, బృందంతో ఇస్రోకు చెందిన హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎం. మోహన్ సంభాషించారు.

# నిధులివ్వండి..ఎపి సర్కార్‌కి సర్పంచుల మొర




అమరావతి, జులై 3: 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని జగన్ సర్కార్ ను డిమాండ్ చేస్తూ ఏపీ సర్పంచ్ ల సంక్షేమ సంఘం ఆందోళనకు దిగింది. తాడేపల్లిలో పంచాయతీరాజ్ కమిషనరేట్ ముట్టడికి సిద్ధమయ్యారు సర్పంచులు. ఒక్కసారిగా సర్పంచులందరు పంచాయతీరాజ్ కమిషనరేట్ వైపు దూసుకురావడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సర్పంచులను అడ్డుకుని దగ్గర్లోని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

తక్షణమే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.691 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీలకు విడుదల చేయాలని సర్పంచుల గౌరవ వేతనాన్ని 3000 నుంచి 15 వేలకు పెంచాలని డిమాండ్ చేసారు. తమ జీతాలు వాలెంటర్ల జీతాల కంటే తక్కువని ఆవేదన వ్యక్తం చేశారు.. అప్పులు చేసి గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడితే ఆ నిధులు తమకు ఇవ్వడం లేదని వాపోయారు..

# సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రేపు నేషనల్ మ్యూజియంలో ఆషాఢ పూర్ణిమ కార్యక్రమాన్ని నిర్వహించనున్న అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య (ఐబిసి)

న్యూఢిల్లీ, జులై 3:కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య (ఐబిసి) 2023 జూలై 3 న ఆషాఢ పూర్ణిమను నేషనల్ మ్యూజియం, జనపథ్, న్యూఢిల్లీలో నిర్వహిస్తుంది. ధర్మ చక్ర ప్రవర్తన దివస్‌గా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతి ఏడాది ఒక ముఖ్యమైన కార్యక్రమంగా ఆషాఢ పూర్ణిమ కార్యక్రమం నిర్వహిస్తుంది. బుద్ధ పూర్ణిమ లేదా వైశాఖ పూర్ణిమ తర్వాత బౌద్ధులకు రెండవ అత్యంత పవిత్రమైన రోజు ఆషాఢ పూర్ణిమ. ఆషాఢ పూర్ణిమ సందర్భంగా రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం చేస్తారు.

లుంబినీ (నేపాల్)లో ఐబిసి అమలు చేస్తున్న ప్రత్యేక ప్రాజెక్ట్ – "ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ బుద్ధిస్ట్ కల్చర్ అండ్ హెరిటేజ్ "పై ప్రసారం చేసే చలన చిత్రం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గత సంవత్సరం బుద్ధ పూర్ణిమ నాడు నేపాల్‌లోని లుంబినీలో ఈ కేంద్రానికి శంకుస్థాపన చేశారు.

ఆషాఢ పూర్ణిమ విశిష్టతను మతపెద్ద 12వ చామ్‌గోన్ కెంటింగ్ తై సితుపా తన ధర్మ ప్రసంగంలో వివరిస్తారు.

సాంస్కృతిక విదేశీ వ్యవహారాల మంత్రి శ్రీమతి మీనాక్షీ లేఖి కార్యక్రమంలో ప్రసంగిస్తారు. అనేక ఇతర ప్రముఖులు, బౌద్ధ సంఘాల అధిపతులు,పండితులు, న్యూఢిల్లీలో ఉన్న దౌత్య కార్యాలయాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

భారతదేశ చారిత్రక వారసత్వం, బుద్ధుని జ్ఞానోదయం, ఆయన ధర్మ బోధలు, మహాపరినిర్వాణానికి అనుగుణంగా ఐబిసి ఆషాఢ పూర్ణిమ వేడుకలను జాతీయ మ్యూజియం, జనపథ్‌లో నిర్వహిస్తోంది, ఇక్కడ సఖ్యముని పవిత్ర అవశేషాలు ఉన్నాయి.

సారనాథ్ వద్ద బుద్ధుడు మొదటి సారి ధర్మ బోధన చేశారు. ఇక్కడ నుంచి ధర్మ చక్రం ప్రయాణం ప్రారంభం అయ్యింది. భారతీయ చాంద్రమానం ప్రకారం ఆషాఢ మాసం పౌర్ణమి రోజున వచ్చే ఆషాఢ పూర్ణిమను శ్రీలంకలో ఎసల పోయగా, థాయిలాండ్‌లో అసన్హాబుచాగా పాటిస్తారు. . ఆషాఢ పౌర్ణమి రోజున భారతదేశంలోని వారణాసికి సమీపంలో ఉన్న ప్రస్తుత సారనాథ్ లోని షిషిపతన మృగదయంలోని 'డీర్ పార్క్'లో జ్ఞానోదయం పొందిన తర్వాత బుద్ధ భగవానుడు తన మొదటి ఐదుగురు సన్యాసి శిష్యులకు (పంచవర్గీయ) జ్ఞాన ప్రబోధం చేశారు.

సన్యాసులు, సన్యాసినుల కోసం వర్షాకాలం తిరోగమనం (వర్ష వస్సా) కూడా జూలై నుంచి అక్టోబర్ వరకు మూడు చాంద్రమాన నెలల పాటు ఈ రోజుతో ప్రారంభమవుతుంది, ఈ సమయంలో వారు ఒకే స్థలంలో నివసిస్తారు.

సాధారణంగా దేవాలయాలలో ధ్యానంలో నిమగ్నం అవుతారు. ఈ రోజును బౌద్ధులు, హిందువులు తమ గురువులను గౌరవించే రోజుగా గురు పూర్ణిమ గా పాటిస్తారు.

# హుటాహుటిన ఢిల్లీకి బండి సంజయ్

### – ఆయన పదవి విషయమై రకరకాల ఊహాగానాలు

న్యూ ఢిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కాసేపటి క్రితం ఢిల్లీ చేరుకున్నారు. నేడు బీజేపీ అధిష్టానం పెద్దలను ఆయన కలవనున్నారు. అధిష్టానం పెద్దల పిలుపుతో ఏం జరగనుందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే తెలంగాణలో ఆయన పదవి విషయమై రకరకాల ఊహాగానాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే బండి సంజయ్ కూడా తాజాగా కార్యకర్తల వద్ద తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీన వరంగల్‌లో జరిగే ప్రధాని మోదీ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో హాజరౌతానో లేదోనని బండి సంజయ్ ఆదివారం హన్మకొండలో కార్యకర్తలతో అన్నారు. రాష్ట్ర పార్టీ బాధ్యతలను బండి సంజయ్ నుంచి తప్పించి కేంద్ర క్యాబినెట్‌లోకి తీసుకుంటారని.. రాష్ట్రంలో పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నియమిస్తారని ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటూ పార్టీ కేడర్‌లో జోష్ నింపే ఆయన.. ఆదివారం ముభావంగా ఉండిపోయారు. 8న ప్రధాని మోదీ వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా కిషన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి అక్కడ ఏర్పాట్లను సమీక్షించిన సంజయ్.. అంటీముట్టనట్లుగా వ్యవహరించారు. వరంగల్‌లో జరిగిన మీడియా సమావేశంలో తన సహజశైలికి భిన్నంగా ముక్తసరిగా మాట్లాడారు. ఒకవేళ పార్టీ రాష్ట్ర బాధ్యతల నుంచి తనను తప్పించినా.. అధైర్యపడవద్దని బండి సంజయ్ తనను అభిమానించే కార్యకర్తలు, నాయకులకు బండి నచ్చజెబుతున్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని స్పష్టం చేస్తున్నారు. అయితే, బండివల్లే తెలంగాణలో బీజేపీకి గ్రామీణ స్థాయి వరకు విస్తరించిందని, పోరాట స్ఫూర్తితోనే గ్రామాల్లో అధికార పక్ష నేతల అరాచకాలను ఎదుర్కొన్నామని కార్యకర్తలు ఆదివారం ఆయనతో అన్నారు. బండినే అధ్యక్షుడిగా కొనసాగించాలంటూ కార్యకర్తలు కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా.. బండి సంజయ్ మనస్తాపానికి గురైన విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లిందని.. దీనిపై వారి నిర్ణయం ఏమిటో ఒకటి, రెండు రోజుల్లోనే తేలిపోతుందని.. కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఈ సస్పెన్స్ త్వరలోనే తెరపడుతుందని.. పార్టీ ముఖ్యనేత ఒకరు చెప్పారు. నాఇఃజీనినివట ఎఎ ఉఎజీతిశ్రీ

# సబర్మతి రివర్ ఫ్రంట్‌లో మేడ్ ఇన్ ఇండియా 'అక్షర్ రివర్ క్రూయిజ్'ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జులై 3:అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మరియు సబర్మతి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన సబర్మతి రివర్ ఫ్రంట్‌లో మేడ్ ఇన్ ఇండియా 'అక్షర్ రివర్ క్రూయిజ్'ని కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈరోజు ప్రారంభించారు.

శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో, ఈ అక్షర రివర్ క్రూయిజ్ ద్వారా, గుజరాత్ ప్రభుత్వం మరియు మున్సిపల్ కార్పొరేషన్ ఈ రోజు అహ్మదాబాద్ నగర పౌరులకు కొత్త బహుమతిని అందించాయని అన్నారు. శ్రీ నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తాను మొదటిసారిగా భారతదేశంలో నదీ తీర విహారం (రివర్ ఫ్రంట్) ను ఊహించి, ప్లాన్ చేశారని, అది ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే అభివృద్ధి చేయబడి పూర్తి చేయబడిందని ఆయన అన్నారు. రివర్ ఫ్రంట్ అహ్మదాబాద్‌లోనే కాకుండా భారతదేశం మరియు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని మరియు పర్యాటక ఆకర్షణ కేంద్రంగా ఆవిర్భవించిందని శ్రీ షా చెప్పారు.

నదీతీర విహార నిర్మాణం వల్ల నీటిమట్టం పెరగడమే కాకుండా, వృద్ధులు, పిల్లలు, యువతతో సహా ప్రతి ఒక్కరికీ వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా ఆవిర్భవించిందని కేంద్ర హోం మరియు సహకార మంత్రి అన్నారు. ఈ లగ్జరీ రివర్ క్రూయిజ్ అహ్మదాబాద్ పౌరులందరికీ కొత్త ఆకర్షణగా నిలుస్తుందని ఆయన అన్నారు. అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మరియు సబర్మతి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లచే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో ఈ క్రూయిజ్ అభివృద్ధి చేయబడిందని ఆయన తెలిపారు. ఈ క్రూయిజ్ భారతదేశంలో మేక్ ఇన్ ఇండియా కింద ?15 కోట్ల వ్యయంతో జంట ఇంజిన్‌లతో నిర్మించిన మొదటి ప్రయాణీకుల విహార నౌక మరియు ఇది ఒకటిన్నర గంటల పాటు సురక్షితంగా విహారం ప్రయాణించగలదు. ఈ 30 మీటర్ల క్రూయిజ్ అహ్మదాబాద్ మరియు దేశంలోని ఈ నగరాన్ని సందర్శించే పౌరులందరికీ ఆకర్షణీయంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ క్రూయిజ్‌లో 165 మంది ప్రయాణికులు ప్రయాణించే అవకాశం ఉందని, ఇందులో రెస్టారెంట్ కూడా ఉందని, ఇది కచ్చితంగా ప్రజలను ఆకర్షిస్తుందని శ్రీ షా చెప్పారు.

పౌరుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ క్రూయిజ్‌ని రూపొందించామని, ఇందులో 180 ప్రాణ రక్షణ జాకెట్లు, అగ్ని మాపక సురక్షణ, అత్యవసర రక్షణ బోట్‌లు ఉన్నాయని శ్రీ అమిత్ షా తెలిపారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీ నరేంద్ర మోదీ అహ్మదాబాద్, గుజరాత్ టూరిజానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. శ్రీ నరేంద్ర మోదీ పర్యాటక రంగంలో చేపట్టిన అనేక కార్యక్రమాల కారణంగా గుజరాత్ మరియు దాని రెండు ప్రధాన పర్యాటక కేంద్రాలు దేశ పర్యాటక పటంలో ప్రముఖంగా నిలిచాయని ఆయన అన్నారు. కోట్లాది రూపాయల పెట్టుబడితో గుజరాత్‌కు వచ్చే లక్షలాది మంది పర్యాటకుల కోసం పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేశామని, అన్ని తీర్థయాత్రలు మరియు సరిహద్దులను కలుపుతూ మంచి రోడ్లు నిర్మించామని, పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడానికి విమానాశ్రయాలను పర్యాటక ప్రాంతాలకు అనుసంధానించే రహదారులను కూడా నిర్మించామని చెప్పారు.

అంబాజీ వద్ద దృశ్య శ్రవణ ప్రదర్శన ప్రారంభమైందని, 500 ఏళ్ల తర్వాత పావగడ ఆలయంలో జెండా ఎగురవేయడం జరిగిందని, మాధవపూర్ జాతర జాతీయ జాతరగా మారిందని, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకుల కోసం కచ్‌లో టెంట్ నగరాన్ని నిర్మించామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. దీనితో పాటు, కంకారియా చెరువు మరియు ఇప్పుడు, అహ్మదాబాద్‌లోని ఈ రివర్ ఫ్రంట్‌తో పాటు, భారీ పర్యాటక పర్యావరణ వ్యవస్థ సృష్టించబడింది. సర్హద్ దర్శన్ ప్రోగ్రామ్ (సరిహద్దు సందర్శన కార్యక్రమం) కింద, క్లిష్ట పరిస్థితుల్లో భద్రతా దళాలు తమ విధులను నిర్వర్తించే నాడబెట్ అనుభవాన్ని గుజరాత్ యువతకు అందించడానికి కూడా ఏర్పాట్లు చేశామని శ్రీ షా చెప్పారు.

శ్రీ నరేంద్ర మోదీ టూరిజం అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లారని, దీని కారణంగా గుజరాత్‌కు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకుల తాకిడి చాలా రెట్లు పెరిగిందని ఆయన అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం అహ్మదాబాద్‌లో ఉందని, ఇక్కడ క్రికెట్ మ్యాచ్‌లు క్రమం తప్పకుండా జరుగుతాయని, పర్యాటకం కూడా పెరిగిందని శ్రీ షా తెలిపారు. ఇది కాకుండా, ఇప్పుడు చాలా పెద్ద స్పోర్ట్స్ సిటీ కూడా ఇక్కడ రూపుదిద్దుకుంటోంది. ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలు చేపట్టి గుజరాత్ పర్యాటక రంగానికి కొత్త కోణాన్ని అందించారన్నారు.

ప్రపంచంలోని అన్ని రంగాలలో భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలపడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గత 9 సంవత్సరాలలో చేసిన కృషికి ఇప్పుడు ఫలితాలు కనిపిస్తున్నాయని శ్రీ అమిత్ షా అన్నారు. గత 9 ఏళ్లలో గరీబ్ కళ్యాణ్, భారత్ గౌరవ్, భారత్ ఉత్కర్ష్, మౌలిక సదుపాయాల కల్పన వంటి పథకాల ద్వారా యావత్ భారతదేశ అభివృద్ధికి ప్రధాని మోదీ కొత్త రూపు ఇచ్చారని అన్నారు.

# ఈ నెల 16న విశాఖలో బీసీల మహా గర్జన

హైదరాబాద్ జులై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్) వచ్చే -పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లుపెట్టాలని, జనగణన లో కుల గణన చేయాలనీ డిమాండ్ చేస్తూ ఈ నెల 16న బీచ్ రోడ్డు ఏయు కన్వర్షన్ విశాఖలో బీసీ గర్జన సదస్సు ఏర్పాటు చేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్ విద్య నగర్ బీసీ భవన్ లో విశాఖ బీసీ గర్జన పోస్టర్ని ఆర్ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సభకు జాతీయ బి.సి అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు.పార్లమెంటులో ప్రతిపక్షాలు కుల గణన పై మరియు బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లపై రాజ్యాంగబద్ధమైన హక్కులకై చర్చ జరపాలని కోరారు. కుల గణన జరుపాలని 8 రాష్ట్ర అసెంబ్లీలు తీర్మానాలు చేశాయి. 16 రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. వీరు పార్లమెంట్ ను స్తంభింప చేసి చిత్తశుద్ది నిరూపించుకోవాలి. రెండు రాష్ట్రాలకు చెందిన జూఖీఅఖ, ఎఖీూ ? కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు పార్లమెంటును స్తంభింప చేయాలని కోరారు. ఇతర సమస్యలపై రోజు పార్లమెంటులో ఉద్యమాలు చేస్తున్న మాదిరిగా కుల గణన పై కూడా పార్లమెంటులో చర్చ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా జనగణన లో జరిగే అవకాశం ఉన్నా బీసీ వ్యతిరేక వైఖరితో డిమాండును అంగీకరించడం లేదన్నారు. పార్లమెంటును ప్రతిపక్షాలు స్తంబింప జేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బి.సి కుల గణన పై ఇంతవరకు విధాన ప్రకటన జారి చేయలేదన్నారు. కార్యక్రమంలో బోను దుర్గ నరేష్ రాయుడు రాకేష్ (కాకా) పితాని హనిప్ చంద్ర వేముల రామకృష్ణ, బిసి వెంకట్, ఆళ్ల రామకృష్ణ, శ్రీనివాస్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలి:జిల్లా రెవెన్యూ అధికారి శిరీష



ఖమ్మం, జులై 3: (నేటినిజం ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి శిరీష సంబంధిత శాఖల జిల్లా అధికారులకు సూచించారు. ఐడిఓసి సమావేశ మందిరంలో సోమవారం "గ్రీవెన్స్ డే"లో అర్జీదారులను నుండి పలు సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా రెవెన్యూ అధికారి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందనలు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగు చర్య నిమిత్తం దరఖాస్తులను ఎండార్స్ చేశారు. ఖమ్మం నగరంకు చెందిన మెండె వెంకటేశ్వర్లు తనకు రఘునాధ పాలెం మండలం కోయచెలక రెవెన్యూ సర్వేనెం. 193/ఆ/4 నందు1.00 ఒక ఎకరం భూమి కలదని అట్టి భూమిలో కెజిబివి పాఠశాల రఘునాథపాలెం క్రీడాప్రాంగణంకు కేటాయించినట్లు తెలుసుకొని తెలంగాణ హైకోర్టు, హైద్రాబాదు నందు రిట్‌పిటీషన్ వేయగా,వారు తీర్పు వెలువరించారని,అట్టి తీర్పు ప్రకారం మా భూమిని సర్వేచేయించి తమ భూమికి హద్దులు నిర్ణయించగలరని సమర్పించిన దరఖాస్తును తగుచర్య నిమిత్తం సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏ.డికి సూచించినారు. కూసుమంచి మండలం,నాయకన్ గూడెంకు చెందిన ఉల్లోజు వెంకటనారాయణ తాను ఎస్సీ కులమునకు చెందిన వాడనని,కూలీచేసి జీవనం సాగించడం జరుగుచున్నదని తనకు ఎలాంటి ఇంటిస్థలం కాని, భూమి కాని లేదని తనకు దళితబంధు పథకం మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తు ను,తగు చర్య నిమిత్తం ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌కు సూచించారు. ఖమ్మం నగరంకు చెందిన కె.నక్షత్రసాయిని తాను 7వ తరగతి చదువుచున్నానని,తనకు తల్లిదండ్రులు లేరని తనకు శ్రీనివాసనగర్ గుట్టలబజార్ సెయింట్‌జోసెఫ్ హైస్కూల్ నందు1నుండి10వ తరగతి వరకు ఉచిత అడ్మిషన్ లభించడం జరిగినదని,హాస్టల్ వసతి లేకపోవడం చేత ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుచున్నదని, తనకు గురుకుల పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లాసాంఫీ?కసంక్షేమశాఖాధికారికి సూచించారు. సత్తుపల్లి మండలం,బేతుపల్లి గ్రామంకు చెందిన పోలెపాక అనిత తన కుమార్తె పోలేపాక లేఖనకు గురుకుల పాఠశాలలో 9వతరగతిలో అడ్మిషన్ ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఆర్‌సిఓ ఎస్సీ వెల్ఫేర్ అధికారికి సూచించారు. అష్టగుర్తి ప్రభుత్వ జడ్పీఎస్ఎస్ హైస్కూల్ నందు 8వ తరగతి చదువుతున్న టి.సంజీవని తనకు మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో ఖాళీ ఉన్నచోట అడ్మిషన్ ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును పరిశీలనచేసి తగుచర్య నిమిత్తం సూచించినారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామంకు చెందిన దరావత్ శ్రీను తాను90శాతం అంగవైకల్యం కలిగిన గిరిజనుడనని,తను సాగుచేసుకుంటున్న పోడు భూమికి పట్టా ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం కొణిజర్ల ఎంపిడిఓకు సూచించారు. ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం గ్రామంకు చెందిన చామకూరి గోవర్ధన్ తనకుమార్తె చామకూరి కుస్మిత పుట్టుకతో మూగ,చెవుడు వైకల్యం ఉందని,వికలాంగుల పించను మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా గ్రామీణాభివృద్ధి డిసబుల్డ్ పెన్షన్ డిపిఎంకు సూచించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు "గ్రీవెన్స్‌డే"లో పాల్గొన్నారు.

# "స్టార్టప్‌ల మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ" ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టాలి- సైన్స్ & టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 3:ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతను ప్రోత్సహించడమే లక్ష్యంగా "స్టార్టప్‌ల మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ"ను చేపట్టామని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ఎంఓఎస్ పిఎంఓ, అణుశక్తి శాఖ మరియు అంతరిక్ష శాఖ మరియు సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

న్యూఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ లాబొరేటరీలో సిఎస్ఐఆర్ నిర్వహించిన 'నేషనల్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెస్టివల్'లో తన ప్రారంభ ప్రసంగంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ "పరిశ్రమలతో పాటు స్టార్టప్‌ల ద్వారా పేటెంట్లు మరియు ట్రేడ్‌మార్క్‌తో సహా మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) దాఖలు అనుసంధానాలు భారతదేశంలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయి మరియు సంస్థను ప్రేరేపిస్తాయి. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం 2016లో ఐపిఆర్ చట్టాన్ని తీసుకువచ్చిన తర్వాత, ట్రేడ్‌మార్క్ నమోదు ప్రక్రియ ఒక నెలకు తగ్గిందని, అది గతంలో ఒక సంవత్సరం కంటే ఎక్కువ" అని అన్నారు.

"దీని తర్వాత, 'స్టార్టప్‌ల మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ' పథకం తీసుకురాబడింది, ఇది పేటెంట్ ఫైలింగ్‌లో 80% రాయితీని మరియు పరిశ్రమ మరియు కంపెనీలకు సంబంధించి 40%-50% రాయితీని అందిస్తుంది" అని మంత్రి చెప్పారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ " స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను మరియు వాటి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఒకదానికొకటి అనుబంధంగా ఉండే అనేక పథకాలను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. తద్వారా మీరు స్టార్టప్‌లను ప్రారంభించవద్దు. అందుకు మీకు ముద్రా పథకం ఉంది అది మీకు ఎలాంటి గ్రాట్యుటీ, తనఖా, దాదాపు వడ్డీ లేకుండా 10 నుండి 20 లక్షల రుణాన్ని అందిస్తుంది" అని ఆయన చెప్పారు.

స్టార్టప్‌ల కోసం ఐపీఆర్‌లను రక్షించే దృష్టితో స్టార్టప్‌ల ఆవిష్కరణ మరియు సృజనాత్మకతను ప్రోత్సహించడానికి స్టార్టప్‌ల మేధో సంపత్తి రక్షణ (ఎస్ఐపిపి) అనే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. స్టార్టప్‌లకు పేటెంట్ దాఖలు రుసుముపై 80% రాయితీ మరియు పేటెంట్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించే సదుపాయం ఈ పథకం అందిస్తుంది. కొత్త ట్రేడ్‌మార్క్ నిబంధనల ప్రకారం స్టార్టప్‌లకు ఇతర కంపెనీలకు సంబంధించి ఫీజులను దాఖలు చేయడంలో 50% రాయితీ ఇవ్వబడింది.

కొత్త డిజైన్ సవరణ నియమాలు 2021 ప్రకారం స్టార్టప్‌ల ద్వారా పారిశ్రామిక డిజైన్‌ల రిజిస్ట్రేషన్‌ను ప్రోత్సహించడానికి కూడా ప్రభుత్వం చిన్న సంస్థల కోసం ఫైలింగ్ మరియు ప్రాసిక్యూషన్ ఫీజులను తగ్గించింది.

ఇన్నోవేటివ్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్స్ పరంగా స్టార్టప్‌లకు భారీ స్థాయిలో ప్రోత్సాహం మరియు ప్రమోషన్ ఉందని మంత్రి అన్నారు.

"గత తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ సైన్స్ మరియు శాస్త్రవేత్తలకు గౌరవం ఇచ్చారు మరియు అంతర్జాతీయ చర్చల అంశంగా కూడా పెంచారు. ఇటీవలే ముగిసిన యూఎస్ పర్యటనలో కూడా ప్రధాని జాయింట్ స్టేట్‌మెంట్‌లోని ప్రధాన అంశం సైన్స్ సంబంధిత అంశాలు, సెమీకండక్టర్ల నుండి అంతరిక్షం వరకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, ఆర్టెమిస్ అకార్డ్స్ వరకు అనేక అంశాలు ఉన్నాయని" డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో మనం 31 స్థానాలు ఎగబాకి 81 నుండి 40కి చేరుకున్నామని మంత్రి చెప్పారు. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను మనం చాలా ఆలస్యంగా ప్రారంభించామని 2016లో ప్రధాని మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఎర్రకోట నుండి పిలుపునిచ్చిన కేవలం రెండు సంవత్సరాలలోనే మనం ప్రపంచంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో నం.3 ర్యాంకింగ్‌కు చేరుకున్నాము అని తెలిపారు.

సాంప్రదాయ విజ్ఞానం మరియు వారసత్వ డిజిటల్ రిపోజిటరీని ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలతో కలపాలని మరియు ఈ యంత్రాంగాన్ని సంస్థాగతీకరించడం ద్వారా ఖాదీ, అరోమా మిషన్ మరియు లావెండర్ సాగు వంటి రంగాలలో మనం అత్యాధునికతను పొందగలమని డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు.

" ప్రస్తుతం అత్యుత్తమ సమయం నడుస్తోంది. మనం ఈ స్టార్టప్ ఐపీఆర్ రక్షణలో ఉన్నట్లయితే స్టార్టప్ వెంచర్‌లను మన సాంప్రదాయ జ్ఞానంతో అనుబంధించడం వల్ల మనకు ప్రయోజనం ఉంటుంది, ఇది తరచుగా జరగడం లేదు. ఇక్కడ జరుగుతుంది. మరియు మనం అలా చేస్తే, వాస్తవానికి ఇతర దేశాలపై మనకు ఎడ్జ్ ఉంటుంది" అని చెప్పారు.

ప్రధాని మోదీ నేతృత్వంలోని తొమ్మిదేళ్ల పాలనలో అలాంటి దృక్పథాన్ని కలిగి ఉన్నందున నేడు మనం అభివృద్ధి చెందిన దేశాలతో సమాన వేగంతో మరియు సమాన స్థాయిలో ఉన్నామని మంత్రి అన్నారు.

"నేడు మనం టెక్నాలజీ అప్లికేషన్‌లో ఇతర దేశాలతో సమాన భాగస్వాములం. ఉదాహరణకు క్వాంటమ్ కంప్యూటింగ్‌లో మనం అభివృద్ధి చెందిన దేశాలతో సమానమైన లీగ్‌లో ఉన్నాము" అని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా డీఎస్ఐఆర్ సెక్రటరీ, సీఎస్ఐఆర్ డీజీ డాక్టర్ (శ్రీమతి) ఎన్ కళైసెల్వి మాట్లాడుతూ..ఈ జులై 1 నుంచి 31 వరకూ జాతీయ మేధో సంపత్తి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిపిఐఐటి సెక్రటరీ శ్రీ రాజేష్ కుమార్ సింగ్ మరియు సిఎస్ఐఆర్ మరియు డిఎస్‌టి సీనియర్ శాస్త్రవేత్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# హిట్లర్ ప్రభుత్వం వద్దు

- మావేదికలు అలాంటివికావు
- కాంగ్రెస్ లో స్వేచ్ఛ,స్వంతంత్రాలుఎక్కువ
- వచ్చేఎన్నికల్లో100సీట్లుగెలుస్తాం
- బీఆర్ఎస్ ను బొందపెడుతాం
- బహిరంగసభకుపెద్దఎత్తునప్రజలుహాజరయ్యారు
- తట్టుకోలేకేఅనేకవిమర్శలుచేస్తున్నారు
- విలేకరులసమావేశంలోకాంగ్రెస్ నేతపొంగులేటిశ్రీనివాస రెడ్డి



ఖమ్మం, జులై 3: (నేటినిజం ప్రతినిధి): భయంతో కూడిన హిట్లర్ లాంటి వేదికలు తమవి కావని, ప్రజలు హిట్లర్ పాలించే ప్రభుత్వాలు కోరుకోవడం లేదని.. కాంగ్రెస్ లో స్వేచ్ఛ, స్వతంత్రాలు ఎక్కువని ఖమ్మం మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులకు, నాయకులకు, తన అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 కి 10 కాదు రాష్ట్రవ్యాప్తంగా 100 సీట్లు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, బీఆర్ఎస్ ను బొంద పెడుతామని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇంతకాలం పదవులు లేకున్నా ప్రజల్లోనే ఉన్నానని, అనేక సమావేశాలు ఏర్పాటు చేసి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకున్నాని తెలిపారు. అనేక మంది అభిప్రాయాలు తీసుకున్నాకే కాంగ్రెస్ లో చేరానని చెప్పారు. తాను జనంలోనే ఉన్నా కాబట్టి తనకు రిటర్న్ గిఫ్ట్ గా అంతమంది వచ్చి సభను విజయవంతం చేశారన్నారు. ఉమ్మడి జిల్లా నాయకులంతా కలిసి పనిచేశారని, వివిధ రాష్ట్రాలనుంచి సీఎంలను రప్పించుకుని గతంలో ఇక్కడ జరిగిన బీఆర్ఎస్ సభకు.. ఇప్పుడు జరిగిన పొంగులేటి సభకు తేడా గమనించాలన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాకతో సభలో జోష్ పెరిగిందని, భారీకేడ్లు తోసుకుంటూ వచ్చి యువకులు రాహుల్ గాంధీ స్పీచ్ విన్నారని తెలిపారు.

## అనేక ఇబ్బందులు సృష్టించారు.. అయినా..

సభకు జనాన్ని రాకుండా అధికార పార్టీ నాయకులు అనేక ఇబ్బందులు సృష్టించారని, ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అడ్డుకున్నారని తెలిపారు. అయినా పార్టీ మీద, తన మీద ఉన్న ప్రేమతో లక్షలాది ప్రజలు హాజరయ్యారని చెప్పారు. తన కూతురి వివాహ రిసెప్షన్ కోసం సాగర్ కాల్వ బ్రిడ్జి మీద ఏర్పాటు చేసి వంతెనను తీసేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తే.. హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నామని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకుందామని మేము భావించి బస్సులు అడిగితే ముందు ఇస్తామని తరువాత ఇవ్వడం కుదరదని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అయినా ప్రజలు వివిధ రూపాల్లో సభకు వస్తుంటే అడ్డుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. బీఆర్ఎస్ సభలు పెడితే అధికార యంత్రాంగాన్ని మొత్తం ఉపయోగించుకుంటుందని, తాము సభలు పెడితే కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆరోపించారు.

జాతీయ పార్టీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వస్తుంటే పోలీసులు సభ వద్ద ఉండకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్కడ కాపలాగా ఉన్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ కుమారుడు రాహుల్ గాంధీ సభకు వస్తుంటే ముఖ్యమంత్రి, డీజీపీ, సీపీ ఇచ్చే మర్యాద ఇదేనా అంటూ దుయ్యబట్టారు. సభ సక్సెస్ అయిందని అన్ని పత్రికలు, చానళ్లలో పేర్కొంటే.. అధికార పత్రిక, ఛానల్ మాత్రం కరపత్రంలా మారి కల్పిత కథలతో వారికి అనుకూలంగా డబ్బా కొట్టుకుందన్నారు.

## - వారికి కంటివెలుగు అద్దాలు అవసరం..

అధికార పార్టీలో తనకు సరైన గౌరవం లభించడం లేదని ఓ మంత్రి షిండే అవతారం ఎత్తుదామని ప్రయత్నించడం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పింఛన్ పెంచాలని మంత్రులు డిమాండ్ చేస్తున్నారని వారి సలహాలు తీసుకునే స్థాయిలో కాంగ్రెస్ పార్టీ లేదని అభిప్రాయపడ్డారు. అక్కడ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా రానున్న కాలంలో తగిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అవినీతి జరిగిందని తాము చెప్పడం లేదని, కాగ్ నివేదికలోనే ఈ విషయం వెల్లడించందని తెలిపారు. సభకు జనాలు రాలేదని బీఆర్ఎస్ మంత్రులు ప్రెస్ మీట్లు పెట్టి మరీ చెబుతున్నారని, వారికి కామెర్లు వస్తే తామేమి చేస్తామని సెటైర్ వేశారు. జనాలు కనపడకపోతే 'కంటివెలుగు' అద్దాలు ధరించి చూడాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, మువ్వా విజయ బాబు, తుళ్ళూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, డాక్టర్ రాజా రమేష్, ఎన్నారై రఘూన్సీ రెడ్డి, జారె ఆది నారాయణ, కొండూరు సుధాకర్, వూకంటి గోపాల్ రావు, విజయ భాయి, సుతగాని జైపాల్, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి తదతరులు ఉన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై డ్రోన్ కలకలం

న్యూఢిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై డ్రోన్ కలకలం రేపింది. 'నో-ఫ్లైయింగ్ జోన్'లో డ్రోన్లు కనిపించడంతో ప్రధాని నరేంద్ర మోదీ ఎస్పీజీ భద్రతా సిబ్బంది ఢిల్లీ పోలీసులకు సోమవారం తెల్లవారుజామున 5.30 గంటలకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఆ డ్రోన్ కోసం ఢిల్లీ పోలీసుల అన్వేషణ మొదలైంది. ఇప్పటికైతే ఎలాంటి డ్రోన్ ఆచూకీ తెలియలేదు. ప్రధాని నివాసం 'రెడ్ నో-ఫ్లై జోన్ లేదా నో డ్రోన్ జోన్' పరిధిలో ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈ జోన్‌లో డ్రోన్లపై నిషేధం ఉంటుంది. అయినప్పటికీ డ్రోన్ కనిపించిందని ఎస్పీజీ అధికారులు చెప్పడం కలకలం రేపుతోంది.ఢిల్లీలోని 'రేస్ కోర్స్ రోడ్'లో ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసం ఉంది. ఈ నివాసం ఐదు భవనాల సముదాయం. 9,7,5,3,1 నంబర్లతో ఆ భవనాలు ఉండటం గమనార్హం. ప్రధాని కార్యాలయ సముదాయం భద్రతా వలయంలో ఉంటుంది. సామాన్య ప్రజానీకానికే కాదు మీడియాకు కూడా అనుమతి కష్టం. కొన్ని సందర్భాల్లో మాత్రమే విలేకరులను కాన్ఫరెన్స్ రూమ్స్ వరకూ అనుమతిస్తారు. అయితే.. ఫొటోలు తీయడం మాత్రం నిషేధం.

# ఉస్మానియా హాస్పటల్‌లో గవర్నర్ ఆకస్మిక తనిఖీ-వైద్య సదుపాయాలపై ఆరా..

హైదరాబాద్, జులై 3:ఉస్మానియా నూతన భవన నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలంటూ ట్విట్టర్ వేదికగా పేర్కొన్న గవర్నర్ తమిళిసై నేడు ఆ హాస్పటల్ ను సందర్శించారు.. ఉస్మానియా నూతన భవన నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలంటూ గతంలో ట్విట్టర్ వేదికగా పేర్కొన్న గవర్నర్ తమిళసై.. ఇప్పుడు నేరుగా ఉస్మానియా ఆసుపత్రిని విజిట్ చేశారు. ఈ సందర్భంగా తమిళిసై బిల్డింగ్ నిర్మాణం తదితర వివరాలను అడిగితెలుసుకున్నారు. బిల్డింగ్ పరిస్థితిని డిప్యూటీ అధికారులు గవర్నర్ కు వివరించారు. అనంతరం తమిళిసై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారితో మాట్లాడారు.

సౌకర్యాలు, వైద్యం అందుతున్న తీరు.. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్స్ వసతులు సరిగా లేవని, న్యూరో సర్జన్ రూమ్ కు అసలు పై కప్పు లేదని గవర్నర్ అసహనం వ్యక్తం చేశారు.. తనపై ఎవరు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోనని, తన లక్ష్యం పేదలకు వైద్య సేవలు సరిగా అందలనేదే తన తపన అని పేర్కొన్నారు.. ప్రభుత్వ కార్యక్రమాలను పొగడటం తన బాధ్యత కాదని తేల్చి చెప్పారు..

కాగా గతంలో గతంలో గవర్నర్ చేసిన ట్వీట్‌కి మంత్రి హరీష్‌రావు కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జరిగే అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు మంత్రి హరీష్‌రావు. ప్రభుత్వం ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు మంత్రి. కోర్టు పరిధిలో ఉండడం వల్ల సైలెంట్‌గా ఉన్నామని మంత్రి పేర్కొన్నారు. మరో విషయం ఏమిటంటే గవర్నర్ ఉస్మానియాను సందర్శిస్తున్న సమయంలోనే హారీష్ రావు తన చాంబర్ లో వైద్య శాఖ అధికారులతో ఉస్మానియాపై సమీక్ష నిర్వహించారు.. ఈ సమీక్ష కార్యక్రమం షెడ్యూల్ 20 రోజుల క్రితమే ఖరారు కాగా, ఈ విషయం తెలుసుకున్న గవర్నర్ నేడు ఆకస్మిక ఉస్మానియాను సందర్శించారంటూ బిఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.


## తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం
ఉమ్మడి కరీంనగర్ జిల్లా

ఆహ్వానము

ప్రముఖ కవి, రచయిత, కాలమిస్ట్
డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన
మధుపాళీ... మధు క(వితా)వనం కవితా సంపుటి
గ్రంథ ఆవిష్కరణ సభ

తేది : 04-07-2023 మంగళవారం సా॥ గం॥6.15 ని॥లకు వేదిక : ఫిలిం భవన్, కరీంనగర్

ముఖ్య అతిథి & మధు క(వితా)వనం ఆవిష్కర్త :
శ్రీ దేశపతి శ్రీనివాస్ గారు, ఎమ్మెల్సీ

విశిష్ట అతిథి :
శ్రీ జి.వి.శ్యాంప్రసాద్ లాల్ గారు, అదనపు జిల్లా కలెక్టర్, కరీంనగర్

సభాధ్యక్షులు :
శ్రీ దాస్యం సేనాధిపతి గారు, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

గౌరవ అతిథులు :
డా॥ గంద్ర లక్ష్మణ్ రావు గారు, ప్రముఖ సాహితీవేత్త
శ్రీ వారాల ఆనంద్ గారు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

పుస్తక పరిచయం :
శ్రీ ఏ. గజేందర్ రెడ్డి గారు, అధ్యక్షులు, సమతా సాహితి

ఆత్మీయ అతిథులు :
శ్రీ బి.వి.ఆర్. గోపాల్ రెడ్డి గారు, ఛైర్మన్, నిగమ గ్రూప్ ఆఫ్ కాలేజెస్
శ్రీ నంది శ్రీనివాస్ గారు, అధ్యక్షులు, సాహితీ గౌతమి
శ్రీ గాజుల రవీందర్ గారు, అధ్యక్షులు, జాతీయ సాహిత్య పరిషత్
శ్రీ కొత్త అనిల్ కుమార్ గారు, అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
శ్రీ కె.ఎస్. అనంతాచార్య గారు, ప్రధాన కార్యదర్శి, సమైక్య సాహితి
శ్రీ వైరాగ్యం ప్రభాకర్ గారు, అధ్యక్షులు, ఉదయ సాహితి

ఆహ్వానించువారు : బొమ్మకంటి కిషన్, కార్యదర్శి అనుముల దయాకర్, కోశాధికారి

# బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశం




ఖమ్మం, జులై 3: (నేటినిజం ప్రతినిధి): మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ,ఖమ్మంలో రాహుల్ గాంధీ ప్రేలాపనలు చేశారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ లో పరిపక్వత పెరిగింది అనుకున్నా..కానీ అలాంటిదేమి లేదని రాహుల్ ఖమ్మంలో నిరూపించారు. కాంగ్రెస్ ను మించిన కుటుంబ అవినీతి పార్టీ ఏదైనా ఉందా..రాహుల్ కు అసలు లెక్కలు వచ్చా..కాళేశ్వరంలో అవినీతి జరగలేదని మీ ఎంపి ఉత్తమ్ ప్రశ్న వేస్తే పార్లమెంటులో కేంద్రమే బదులిచ్చింది. తెలంగాణకు ద్రోహం చేసిన పార్టీ కాంగ్రెస్. 2009లో తెలంగాణ ప్రకటన చేసి యూటర్న్ తీసుకుంది కాంగ్రెస్ పార్టీ కాదా.కాంగ్రెస్ కల్లిబొల్లికబుర్లకు తెలంగాణ లొంగదు. ఖమ్మంలో కాంగ్రెస్ లో చేరిన వారంతా అవకాశవాదులే..పొంగులేటితో సహాఎవరికీ కేసీఆర్ అన్యాయం చేయలేదు. ఈ సారి ఖమ్మంలో బీఆర్ఎస్ తొమ్మిది సీట్లు గెలిచి చరిత్ర సృష్టిస్తుంది. ప్రజలు కేసీఆర్ నే గతంలో నమ్మారు..

నమ్ముతారు కాంగ్రెస్ ను గతంలో నమ్మలేదు..ఇక నమ్మరు. కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారు. ఎవ్వరూ ఆపలేరు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ కదా. 4వేల పెన్షన్ ను దమ్ముంటే దేశమంతా ప్రకటించాలి. కాంగ్రెస్ ఏ టూజెడ్ స్కాంల పార్టీ. నిన్నటి సభలో దళిత నేత భట్టికి కాంగ్రెస్ నేతలు అవమానం చేశారు. ఖమ్మంలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు వచ్చిన జనమే రికార్డు. దాంతో పోలిస్తే నిన్నటి కాంగ్రెస్ సభ లెక్కలోకే రాదు.

ఖమ్మం కాంగ్రెస్ సభకు రాష్ట్ర మంతటి నుంచి జనం సమీకరిస్తే ఆ మాత్రం వచ్చారు.. కాంగ్రెస్ నేతలు ఆ జనాన్ని చూసి జబ్బలు చరచుకోవద్దు. జాతరలకు కూడా జనం వస్తారు. గతంలో చిరంజీవి సభలకు కూడా జనం వచ్చారు. ఓట్లు వేయలేదు. తెలంగాణలో ఓట్లు పడేది. కేసీఆర్ కు మాత్రమే. తెలంగాణకు కేసీఆర్ శాశ్వత ముఖ్యమంత్రి. కాంగ్రెస్ హామీలకు తెలంగాణ ప్రజలు పడిపోరు.

ఖమ్మంసభలో కాంగ్రెస్ కలహాలు బయట పడ్డాయి. ముమ్ముందు కాంగ్రెస్ నేతల గ్రూపు కలహాలు మరింత బయట పడతాయి. భట్టికి సభలో అవమానం జరిగింది. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ గెలిచే పరిస్థితి లేదు. ఈ మీడియా సమావేశంలో మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎం.ఎస్. ప్రభాకర్, ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, సురేందర్, సండ్ర వెంకట వీరయ్య, ఎంపీ వద్దిరాజు రవిచంద్రలు ఉన్నారు.

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి ?

**– ఎంపీ బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి**

న్యూ డిల్లీ /హైదరాబాద్ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిని మారుస్తూ అగ్రనాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అధ్యక్షుడిగా.. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డిని కేంద్రం ఖరారు చేసింది. ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన మాత్రమే మిగిలింది. అయితే ఈయనకు ఇప్పుడున్న కేంద్ర మంత్రి పదవి కూడా కొనసాగింపు ఉంటుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. పదవి స్వీకరించడానికి కిషన్ రెడ్డి.. విముఖత చూపినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, అగ్రనేత బీఎల్ సంతోష్‌లు ప్రత్యేకంగా భేటీ అయ్యి ఒప్పించినట్లుగా తెలుస్తోంది.

కాగా.. ఇప్పుడు అధ్యక్షుడిగా ఉన్న ఎంపీ బండి సంజయ్‌ను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంది అధిష్టానం. బండికి కేంద్ర మంత్రిగా అగ్రనేతలు ప్రమోషన్ ఇచ్చారు. కేంద్ర సహాయక మంత్రిగా నియమించినట్లు ఢిల్లీ నుంచి సమాచారం అందుతోంది కానీ.. ఏ శాఖ కేటాయించారన్న విషయం మాత్రం తెలియరాలేదు. అన్నీ అనుకున్నట్లు జరిగితే కాసేపట్లో అధ్యక్ష పదవి, కేంద్ర మంత్రిపదవికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే.. ఉంటే అధ్యక్షుడిగా లేకుంటే ఏ పదవీ తనకొద్దనీ సామాన్య కార్యకర్తగానే పార్టీ కోసం పనిచేస్తానని తన అత్యంత సన్నిహితుల వద్ద బండి తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అధికారిక ప్రకటన వచ్చాక బండి ఎలా రియాక్ట్ అవుతారనే దానిపై అభిమానులు, తెలంగాణ బీజేపీ కార్యకర్తల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉంటే.. మొదట్నుంచీ అనుకుంటున్నట్లుగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను తెలంగాణ బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా అగ్రనాయకత్వం ప్రకటించబోతోంది. రెండు మూడ్రోజులుగా ఈటల యమా యాక్టివ్‌గా ట్వీట్లు చేయడం, బీజేపీ నేతలతో వరుసగా భేటీలు కావడం.. అది కూడా తనకు వ్యతిరేకంగా ఉన్నవారిని సైతం స్వయంగా ఇంటికెళ్లి మరీ రాజేందర్ కలుస్తున్నారు. అయితే కిషన్ రెడ్డి పదవి స్వీకరించడానికి సానుకూలంగా లేకపోతే తర్వాతి ఆప్షన్‌గా ఈటల రాజేందర్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

## రూ. 1.8 లక్షల అక్రమ కలప పట్టివేత- ట్రాక్టర్ సీజ్

ఆదిలాబాద్, జులై 3: మంచిర్యాల జిల్లా కవ్వాల పులుల అభయారణ్యంలోని రెండు వేరువేరు సంఘటనలో అటవీశాఖ అధికారులు రూ. 1.8 లక్ష విలువచేసే అక్రమ టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. అభయారణ్యం లోని ఇందన్ పెల్లి రేంజ్ కవ్వాల గ్రామ సమీపాన అక్రమ కలప తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు రేంజ్ ఆఫీసర్ ఆఫీస్ ఉద్దీన్ సోమవారం తెలిపారు. ట్రాక్టర్ లో 6 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, ట్రా క్టర్ సీజ్ చేశామన్నారు. కడెం మండలంలోని ఇస్లాంపూర్ కు చెందిన కనక జైతును అదుపులోకి తీసుకున్నట్లు అని చెప్పారు.

మరో సంఘటనలో జన్నారం రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రేండ్లగూడ గ్రామ సమీపంలో ఉన్న 6 టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ రెండు సంఘటనలో స్వాధీనం చేసుకున్న అక్రమ టేకు కలప విలువ రూ. 180000 లు ఉంటుందన్నారు.


ఆహ్వానము

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

CULTURE IS LOVE OF HUMANITY

GVR CULTURAL FOUNDATION

ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీత్యాగరాయ గానసభ





"కవిశేఖర" శ్రీ జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన

"వ్యాస మంజూష" గ్రంథావిష్కరణ - డా॥ హిప్నో పద్మాకమలాకర్ గారికి

అంకితోత్సవం మరియు జన్నాభట్ల నరసింహప్రసాద్ కథలు,

నవలికలు - పరిశీలన పై పరిశోధన గావించి డాక్టరేట్ పొందిన

డా॥ మట్టా హారిక, విజయవాడ అభినందన సత్కారం

ముఖ్య అతిథి :

పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

గౌరవ అతిథి : ప్రొ॥ ముదిగొండ శివప్రసాద్, చారిత్రక నవలా చక్రవర్తి

సభాధ్యక్షులు : శ్రీ పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు, సాహితీ కిరణం

సభాప్రారంభం : శ్రీ కళా వి.ఎస్.జనార్ధనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

అతిథుల సత్కారం : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం

పుస్తక సమీక్ష : శ్రీ పెద్దూరి వెంకటదాసు, కవి, రచయిత

జ్యోతి ప్రకాశనం : శ్రీమతి శేషబట్టార్ రజిత ఆచార్య, కూచిపూడి నాట్యగురువు

కృతి స్వీకర్త



డా॥ హిప్నో పద్మాకమలాకర్

స్పందన :

డా॥ హిప్నో పద్మాకమలాకర్

డా॥ మట్టా హారిక,

శ్రీ జనాభట్ల నరసింహప్రసాద్

అభినందన సత్కార స్వీకర్త



డా॥ మట్టా హారిక, విజయవాడ

సాంస్కృతిక కార్యక్రమం : సంగీత విభావరి

గానం : శ్రీ లక్ష్మీనరసింహ సంగీత కళాశాల ప్రిన్సిపాల్, సంగీత గురువు, నాగారం, శ్రీమతి జన్నాభట్ల లక్ష్మీకామేశ్వరి గారి శిష్యులు. మెరుగు విష్ణు భగవాన్, టి. ఆర్తిన్, టి. చరణ్, డి. ద్రుపద్, కె. సత్యసాయిసుజయ్, కె. యశశ్విన్, గానవి, గొర్తి శ్రీధన్వి

కూచిపూడి నృత్యం: బేబి శేషభట్టార్ ఆరోహి శరణ్య

08-07-2023, శనివారం, కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

లయన్ గుడిబండి వెంకటరెడ్డి, చైర్మన్
లయన్ వి.వి. రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి , జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

శ్రీమతి కళా శారదా దీక్షితులు
ప్రధాన కార్యదర్శి, శ్రీత్యాగరాయ గానసభ


# 76 శాతం బ్యాంకులకు తిరిగి వచ్చిన రూ.2000 నోట్లు: ఆర్బీఐ

న్యూ డిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మార్కెట్లో చలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 76 శాతం బ్యాంకులకు తిరిగి వచ్చిందని ఆర్బీఐ సోమవారం వెల్లడించింది. అత్యధికంగా ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్లు చేశారని తెలిపింది. రూ.2000 కరెన్సీ నోట్లను మార్కెట్లో చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు గత మే 19న ఆర్బీఐ ప్రకటించింది.రూ. 2000 కరెన్సీ నోట్లను మార్చుకోవడానికి గానీ, బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి గానీ సెప్టెంబర్ 30 వరకు ఆర్బీఐ గడువు విధించింది. బ్యాంకుల నుంచి వచ్చిన డేటా ప్రకారం గత నెలాఖరు (జూన్ 30) నాటికి రూ.2.72 లక్షల కోట్ల విలువైన రూ.2000నోట్లు బ్యాంకులకు తిరిగి వచ్చాయని ఆర్బీఐ వివరించింది.ప్రస్తుతం మార్కెట్లో ఇంకా రూ.84 వేల కోట్ల విలువైన రూ.2000 నోట్లు చలామణిలో ఉన్నాయని ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో మే 19 నుంచి జూన్ 30 వరకు రూ.2000కరెన్సీ నోట్లు 76 శాతం తిరిగి వెనక్కి వచ్చాయని తేలింది. 87 శాతం నోట్లు వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ల ద్వారా, మిగతా 13 శాతం ఇతర డినామినేషన్ నోట్లతో మార్పిడి జరిగిందని తెలిపింది.

## బస్సు ఢీకొని బాలుడి మృతి- బస్సును ధ్వంసం చేసిన బంధువులు

అమరావతి, జులై 3:ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడు మృతిచెందడంతో బాలుడి బంధువులు ఆగ్రహంతో బస్సును ధ్వంసం చేసిన ఘటన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ధవళేశ్వరం వద్ద చోటుచేసుకుంది. బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న బాలుడు మృతిచెందగా, అతడి తండ్రికి గాయాలయ్యాయి. వివరాలు.. బాలుడిని స్కూల్‌లో దింపేందుకు అతడి తండ్రి బైక్‌పై తీసుకెళ్తున్నాడు. అయితే వారి బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో బాలుడు బస్సు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే బైక్‌పై నుంచి పక్కకు పడిపోయిన బాలుడి తండ్రికి గాయాలయ్యాయి. ఈ ఘటనతో బాలుడి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై బాలుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సును ధ్వంసం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డబుల్ డెక్కర్ బస్సులు మరింత ఆలస్యం.. టెండర్ల ప్రక్రియ పూర్తయినా రోడ్డెక్కని బస్సులు

హైదరాబాద్, జులై 3:రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాను తట్టుకునేందుకు టీఎస్ ఆర్టీసీ ప్రారంభించ తలపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులు మరింత ఆలస్యం కానున్నాయి. నగర ప్రయాణికులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఈ బస్సులు రోడ్డెక్కడానికి మరో రెండు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

ఈ బస్సులను గత ఏడాదే ప్రయోగాత్మకంగా నగరంలోని పటాన్‌చెరు–కోఠి, జీడిమెట్ల–సీబీఎస్, అఫ్జల్‌గంజ్–మెహిదీపట్నం వంటి ప్రధాన రూట్లలో నడపాలని ఆర్టీసీ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, గతంలో 25 డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ టెండర్ల ప్రక్రియకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు.

దీంతో ఆ బస్సుల సంఖ్యను 10కి తగ్గించారు. ఆర్టీసీకి రోజురోజుకు గుదిబండగా తయారవుతున్న డీజిల్ భారం నుంచి బయటపడేందుకు 550 ఎలక్ట్రిక్ బస్సులతో పాటు 10 డబుల్ డెక్కర్ బస్సులకు కూడా టెండర్లు ఆహ్వానించింది. ఈ టెండర్లను ముంబైకి చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. టెండర్ నిబంధనల ప్రకారం ఈ నెలలోనే ఆ సంస్థ టీఎస్ ఆర్టీసీకి డబుల్ డెక్కర్ బస్సులు అప్పగించాల్సి ఉన్నప్పటికీ ఆ బస్సులు ఇంకా తయారీ దశలోనే ఉన్నట్లు సమాచారం. దీంతో టీఎస్ ఆర్టీసీ అధికారులు తయారీ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి బస్సులను అప్పగించాలని సంస్థ యాజమాన్యానికి స్పష్టం చేసినట్లు తెలిసింది.

# త్వరలో మారబోతున్నారని మహా రాష్ట్ర ముఖ్యమంత్రి : సంజయ్ రౌత్

ముంబై జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మహారాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా మారాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ని రెండు ముక్కలుగా చీల్చిన అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంతో చేతులు కలిపిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిఫలంగా మహా సీఎం ఏక్‌నాథ్ షిండే అజిత్‌పవార్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు. అంతే కాకుండా పవార్ వర్గం ఎమ్మెల్యేలు తొమ్మిది మందిని తన క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. ఈ అనూహ్య పరిణామాలతో మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. ఎక్కడ చూసినా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాల గురించే వాడీవేడిగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మారబోతున్నారని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే స్థానాన్ని అజిత్ పవార్ భర్తీ చేస్తారంటూ వ్యాఖ్యానించారు. త్వరలో షిండే సహా 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడబోతోందని చెప్పారు.'ఈ రోజు నేను కెమెరా ముందు ఈ విషయాన్ని చెబుతున్నాను. మహారాష్ట్ర ముఖ్యమంత్రి మారబోతున్నారు. ఏక్ నాథ్ షిండేను తొలగించబోతున్నారు. ఏడాది క్రితం శివసేనలో చీలికలో భాగమైన షిండే సహా 16 మంది ఎమ్మెల్యేలు అనర్హులుగా మారబోతున్నారు. త్వరలో మహా సీఎంగా అజిత్ పవార్ నియమితులవుతారు' అని రౌత్ వ్యాఖ్యానించారు.'శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలను బీజేపీ విచ్ఛిన్నం చేస్తోంది. ఇలా చేయడం వల్ల వారికి (బీజేపీ) ఎలాంటి ప్రయోజనం లేదు. 2024 ఎన్నికల్లో మహారాష్ట్రలో ఐక్యంగా పోరాడుతాం. ఎన్సీపీ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని ప్రధాని మోదీ చెప్పడం విస్మయానికి గురి చేస్తోంది. ఇప్పుడు ఆ నేతలే రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారం చేశారు' అని రౌత్ అన్నారు.

# డీఎంఎ అదనపు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్

న్యూఢిల్లీ, జులై 3:వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్, ఇవాళ, మిలిటరీ వ్యవహారాల విభాగం అదనపు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఈ బాధ్యతలు నిర్వర్తించిన లెఫ్టినెంట్ జనరల్ అనిల్ పురి ఈ ఏడాది ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేశారు.

వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్, 1988 జనవరి 01న, నౌకాదళ కార్యనిర్వాహక విభాగంలో అడుగు పెట్టడం ద్వారా దేశ సేవ ప్రారంభించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (71వ కోర్సు), డెల్టా స్క్వాడ్రన్), మిర్పూర్ (బంగ్లాదేశ్)లోని డిఫెన్స్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, దిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజ్ పూర్వ విద్యార్థి ఆయన. హవాయిలోని ఆసియా పసిఫిక్ సెంటర్ ఆఫ్ సెక్యూరిటీ స్టడీస్‌లో అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ కోఆపరేషన్ కోర్సును కూడా పూర్తి చేశారు.

అతి విశిష్ట సేవ పతకం (ఏవీఎస్ఎం), విశిష్ట సేవ పతకం (వీఎస్ఎం) గౌరవాల గ్రహీత అయిన వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్, తన ఉద్యోగ జీవితంలో, టార్పెడో రికవరీ నౌక ఐఎన్‌టీఆర్‌వీ ఏ72, క్షిపణి నౌక ఐఎన్ఎస్ చాతక్; కార్వెట్ ఎఔా ఖుక్రీ, విధ్వంస నౌక ఐఎన్ఎస్ ముంబైకి కమాండ్ సహా చాలా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. నౌకదాళ నౌకలు శారద, రణవిజయ్, జ్యోతిలో నావిగేటింగ్ అధికారిగా కూడా పని చేశారు. స్టాఫ్ రిక్రూర్‌మెంట్ జాయింట్ డైరెక్టర్, వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో డైరెక్టింగ్ స్టాఫ్, నౌకాదళ కార్యక్రమాల డైరెక్టర్, నౌకదళ నిఘా (ఆపరేషన్స్) విభాగం డైరెక్టర్ వంటివి వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్ చేపట్టిన బాధ్యతల్లో ముఖ్యమైనవి.

నౌకాదళ ఆపరేషన్స్ ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా, రక్షణ మంత్రిత్వ శాఖ (నౌకాదళం) సమీకృత ప్రధాన కార్యాలయంలో ప్రిన్సిపల్ డైరెక్టర్‌గానూ వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్ పని చేశారు. ఫ్లాగ్ ఆఫీసర్‌గా, అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్‌గానూ (విదేశీ, సహకారం, నిఘా) సేవలు అందించారు. ఖడక్వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో డిప్యూటీ కమాండెంట్ & చీఫ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, మహారాష్ట్ర నౌకాదళ ప్రాంతం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్‌గా, కర్ణాటక నౌకదళ ప్రాంతం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్‌గా, నౌకాదళ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్‌గానూ వైస్ అడ్మిరల్ అతుల్ ఆనంద్ బాధ్యతలు నిర్వర్తించారు.

# ఆరోగ్య మంత్రిత్వ శాఖ హిందీ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, జులై 3:"హిందీని ప్రోత్సహించి ఎక్కువగా వాడటం వల్ల వైవిధ్యం ఉన్న దేశంలో జాతీయ స్వరంతో సులువుగా సమాచారం వ్యాప్తి చేయవచ్చు" అని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఈ రోజు జరిగిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ హిందీ సలహా మండలి సమావేశంలో డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రులు ప్రొఫెసర్ ఎస్‌పీ సింగ్ బాఘేల్, డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవహారాల్లో హిందీ వాడకాన్ని ఎక్కువ చేసి, హిందీకి కల్పించడానికి అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖల్లో హిందీ సలహా మండలి ఏర్పాటయింది. ప్రతి రెండు సంవత్సరాలకు కనీసం ఒకసారి మండలి సమావేశం కావాల్సి ఉంటుంది.

మండలి సమావేశంలో మాట్లాడిన డాక్టర్ మాండవీయ జాతీయ భాష ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలన్నారు.' భాష భావ వ్యక్తీకరణకు ఒక వేదికను అందిస్తుంది. బాషా వల్ల జాతీయ భావం పెంపొంది అందరూ కలిసి పనిచేయడానికి భాష ఒక సాధనంగా పనిచేస్తుంది." అని అన్నారు. "ప్రాంతీయ భాషలను ఉపయోగించవచ్చు. అయితే, జాతీయ భాషగా హిందీని గుర్తించి గౌరవించాలి. జాతీయ భావం పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరు హిందీ ని ఉపయోగించాలి" అని మంత్రి పేర్కొన్నారు.

అధికార కార్యక్రమాల్లో హిందీ వాడకాన్ని ఎక్కువ చేయడానికి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న చర్యలను డాక్టర్ మాండవీయ వివరించారు.

అధికార కార్యకలాపాల్లో హిందీ ని వాడాలని డాక్టర్ మాండవీయ సూచించారు. " హిందీ ని అధికార భాషగా అమలు చేయాలని కేంద్ర హోం శాఖకి చెందిన అధికార భాష శాఖ జారీ చేసిన మార్గదర్శలను అమలు చేయడానికి ఆరోగ్య మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉంది. వార్షిక ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి మంత్రిత్వ శాఖ అన్ని చర్యలు అమలు చేస్తుంది. జాతీయ సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా హిందీని మంత్రిత్వ శాఖ గుర్తించింది. హిందీ మన సామూహిక జాతీయతను ప్రతిబింబిస్తుంది." అని డాక్టర్ మాండవీయ అన్నారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ హిందీ మధురమైన, సులభమైన భాష అని అన్నారు. మన సంప్రదాయం వారసత్వంలో భాగమైన హిందీ ని వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రజలతో మమేకం అవడానికి హిందీ ని ఉపయోగించాలన్నారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్‌పీ సింగ్ బాఘేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అధికారిక పనిలో హిందీ వినియోగాన్ని క్రమంగా పెంచాలని కోరారు. అధికారుల్లో హిందీ వాడకంపై మెరుగైన అవగాహన, ప్రచారం కల్పించాలని ఆయన సూచించారు.

హిందీ వాడకాన్ని ఎక్కువ చేయడానికి సమావేశంలో పాల్గొన్న వారు అనేక సూచనలు, సలహాలు అందించారు. అన్ని శాఖల ఔషధాలకు – అల్లోపతి, హోమియోపతి మరియు ఆయుర్వేదం – హిందీలో ముఖ్యంగా హిందీ మాట్లాడే ప్రాంతాల్లో పేర్లు పెట్టాలని సూచించారు. హిందీలో మందులు రాసేలా డాక్టర్లను ప్రోత్సహించాలని కూడా సూచించారు. హిందీలో మందుల పేర్లు రాయడం వల్ల ప్రజలకు సులువుగా అర్థం అవుతుంది. హిందీ వాడకాన్ని ప్రోత్సహిస్తుందని సూచించారు. ప్రజలు హిందీలో మాట్లాడటానికి గర్వపడేలా చూడాలని అన్నారు. ఆంగ్లం మాత్రమే ఆధునిక భాష అనే అభిప్రాయాన్ని ఎదుర్కోవడానికి అధికారిక ప్రయోజనాల కోసం హిందీ వాడకాన్ని మెరుగుపరచాలని కూడా సూచనలు అందాయి. మంత్రిత్వ శాఖల్లో అన్ని పరిపాలన కార్యకలాపాలు హిందీలో జరిగేలా చూడాల్సిన అవసరాన్ని సమావేశం గుర్తించింది. భారతదేశమంతటా ఇటువంటి సమావేశాలు నిర్వహించి గర్వంతో హిందీలో మాట్లాడేలా ప్రజలను ప్రోత్సహించాలని కొంత మంది సభ్యులు సూచించారు.

సమావేశంలో డాక్టర్ అనిల్ అగర్వాల్, పార్లమెంట్ సభ్యులు (రాజ్యసభ), శ్రీ గులాం అలీ, పార్లమెంట్ సభ్యులు (రాజ్యసభ), శ్రీ ప్రతాప్ రావు జాదవ్, పార్లమెంట్ సభ్యులు (లోక్ సభ) పాల్గొన్నారు. ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి, ఐసిఎంఆర్ డిజి డాక్టర్ శ్రీ సుధాన్షు పంత్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ శ్రీమతి రోలీ సింగ్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ జైదీప్ కుమార్ మిశ్రాఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ,శ్రీ రాజీవ్ మాంఝీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయెల్, ఎయిమ్స్ (న్యూఢిల్లీ) డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాస్ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. .

# 25 నియోజకవర్గాలకు కొత్త ఇన్ ఛార్జులు - కసరత్తు చేస్తున్న చంద్రబాబు




అమరావతి, జులై 3:రానున్న ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే సంకల్పంతో శ్రమిస్తున్న తెలుగుదేశం పార్టీ ఇప్పు డు కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. ప్రధానంగా సంస్థా గత మార్పులపై దృష్టి సారించిన అధిష్టానం కొత్త నిర్ణయాలను తీసుకుంటోంది. ప్రధానంగా ఎన్నికల్లో అత్యంత కీలకమైన నియో జకవర్గ ఇంఛార్జ్‌ల అంశంపై దృష్టి పెట్టింది. క్షేత్రస్థాయి లో బలోపేతం అయ్యేందుకు కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఖాళీగా ఉన్న నియో జకవర్గ ఇంఛార్జ్‌ల తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కొత్త ఇన్‌చార్జిలను? నియమించాలన్న నిర్ణయానికి వచ్చింది. తాజాగా వరుసగా నియో జకవర్గ ఇంఛార్జ్‌లను నియమిస్తున్న పార్టీ అధినేత చంద్రబాబు ఇప్పు డు మరో కొత్త నిర్ణయం తీసుకోనున్నారు. 25 నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమించేందుకు కసరత్తు ప్రారంభించారు. గత ఏడాది నుంచే నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ నేతల పనితీరును ఆయన పరిశీలిస్తూ వచ్చారు. అలాగే పార్టీ అంతర్గతంగా సర్వే నిర్వహించి ఆయా ప్రాంతాల్లో నేతల పనితీరుతో పాటు పార్టీ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గతంలోనే కొంతమంది ఇంఛార్జ్‌ల పనితీ రుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న అధిష్టానం ఈ మేరకు వారి కి హెచ్చరికలు కూడా జారీ చేసింది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు పనితీరు మార్చుకోని నేతలకు ఉద్వాసన పలకాలని కఠిన నిర్ణయానికి చంద్రబాబు వచ్చారు. గతంలోని తప్పి దాలకు ఎటువంటి అవకాశం లేకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు.

ప్రధానంగా అభ్యర్థుల ఎంపికపై కూడా ఇప్పటికే ఒక నిర్ణయానికి పార్టీ అధిష్టానం వచ్చింది. కొత్తగా ఎంపిక చేసే నియోజకవర్గ ఇంఛార్జ్‌లను దాదాపు అభ్యర్థులుగా ప్రకటించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పొత్తులు పూర్తయిన, కాకున్నా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను ఎంపిక చేయాలన్న యోచనలో చంద్రబాబు ఉన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే దాదాపు 70 నుండి 80 మంది అభ్యర్థులను అధిష్టానం ఎంపిక చేసింది. వీరిందరికీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నియోజకవర్గాల్లో మకాం వేసి ఎన్నికల కార్యాచరణను ప్రారంభించారు. ఇంకోవైపు యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇకపై నియోజకవర్గ ఇంఛార్జ్‌లు ఉండరని, ఇక నేరుగా అభ్యర్థులే ఉంటారని స్పష్టం చేశారు. దీంతో నియోజకవర్గ ఇంఛార్జ్‌లే దాదాపుగా అభ్యర్థులుగా ఎంపికవు తారన్న భావన నేతల్లో ఉంది. ప్ర ధానంగా రిజర్వ్‌డ్ స్థానాల్లో గతానికి భిన్నంగా అభ్యర్థు లను ఎంపిక చేస్తున్నారు.

గిరిజన, హరిజన వర్గాలకు సంబంధించిన ఉన్నత ఉద్యోగులు, విద్యావంతులకు అవకాశం కల్పించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే కొత్త నియామకాలు జరుగుతున్నాయి . ఎన్నికల నాటికి పూర్తిగా అభ్యర్థుల ఎంపిక జరిగితే ఫలితం తమకు అనుకూలంగా ఉంటుందన్న భావనలో టీడీపీ అధిష్టానం ఉంది. ఈ మేరకే అభ్యర్థులను ఎంపిక చేస్తూ వస్తోంది. రానున్న దసరా నాటికి ఈ కసరత్తును పూర్తి చేసి మేనిఫెస్టోను విడుదల చేసి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో అధినాయకత్వం ఉంది. రెబల్స్‌కు ఆస్కారం లేకుండా తెలుగుదేశం పార్టీ ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఆయా నేతలకు ఇతర అవకాశాలు, పదవులపై స్పష్టమైన హామీని ఇస్తోంది.

## చదువుల తల్లికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అండ..!

హైదరాబాద్, జులై 3: ఆమె నిరుపేద దళిత కుటుంబంలో జన్మించింది. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. నీట్‌లో 454 మార్కులతో జాతీయ స్థాయిలో 9,292 ర్యాంకు సాధించింది. ఎస్సీ కేటగిరిలో ఎంబీబీఎస్ సీటు దాదాపు ఖరారైనట్టే. కానీ, కనీస ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేని కుటుంబం. తండ్రి మేస్త్రీ కూలీగా, తల్లి కూలీగా పని చేస్తున్నది. తల్లిదండ్రులిద్దరి సంపాదన ఆ చదువులతల్లి ఫీజులు చెల్లించలేే దైన్యం. ఎంతో కష్టపడి చదివితే.. పేదరికం వెక్కిరిస్తున్నది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు చెందిన చెరపల్లి శృతిది ఈ దీనగాథ. విద్యార్థి పరిస్థితి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చదువుల తల్లికి బాటసగా నిలిచారు. శృతిని, ఆమె తల్లిదండ్రులను హైదరాబాద్‌కు పిలిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు.శృతిని బాగా చదివించిన ఆమె తల్లి తండ్రులను మంత్రి మెచ్చుకున్నారు. నీట్‌లో సత్తా చాటిన శృతికి వెంటనే ఆర్థిక సహాయం అందచేశారు. ఆమె చదువు పూర్తి అయ్యే వరకు ఎర్రబెల్లి ట్రస్టు ద్వారా బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, శృతికి కుటుంబ పరిస్థితిని వివరిస్తూ ఓ ఒకరు ట్వీట్ చేశారు. దీనిపై ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ స్పందిస్తూ ఆ విద్యార్థి బాధ్యత తీసుకుంటామని రీ ట్వీట్ చేశారు. అయితే, ఆ బాధ్యతను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీసుకున్నారు. తన నియోజకవర్గానికి చెందిన శృతికి అండగా మంత్రి దయాకర్‌రావు నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. తమకు బాసటగా నిలిచిన మంత్రికి రుణపడి ఉంటామన్నారు.

# చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

## -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## -ఆపరేషన్ ముస్కాన్ వాల్ పోస్టర్ విడుదల




రాజన్న సిరిసిల్ల, జులై 3:(నేటినిజం ప్రతినిధి): చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జులై 1 నుండి 31-07-2023 వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్-ఎచీ నిర్వహణ గురించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంటు అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో పని చేసి ముస్కాన్-ఎచీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని,0-18సంవత్సరాల లోపు తప్పిపోయిన, వివిధ రకాల బాల కార్మికులు వారు కిరాణం షాప్ లలో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో పనిచేస్తూ, వదిలివేయబడిన పిల్లలు రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్న పిల్లలు ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా స్టేట్ హోమ్ కు పంపించడం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా బిక్షాటన, వెట్టి చాకిరీ చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. బాలల హక్కుల సంరక్షణ ద్వారానే సంపూర్ణ మానవ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆదిశగా అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులకు సూచించారు.

ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే డయల్ 100కు లేదా పోలీస్ లకు సమాచారం తెలపాలని సూచించారు. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ సబ్ డివిజన్లలో ఇద్దరు ఎస్సై నేతృత్వంలో మహిళా ఏ.ఎస్ఐతో సహా నలుగురు కానిస్టేబుళ్లతో బృందాన్ని ఏర్పాటు చేసామని ప్రతి డిపార్ట్మెంట్ అధికారులు సంయుక్తంగా సమన్వయంతో విధులు నిర్వర్తించి జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ఎస్పీ తెలిపారు. చిన్నపిల్లలు వెట్టిచాకిరికి గురికాకుండా వారి మొహంలో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ అంజయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఎస్ఐలు శ్రీకాంత్, ప్రేమనదం, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, వివిధ డిపార్ట్మెంట్ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు.. ఆ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ..!

హైదరాబాద్, జులై 3: రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భారీ వర్షాలతో పాటు రాబోయే రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతాయని తెలిపింది.

ఈ నేపథ్యంలో నిజామాబాద్, జగిత్యాల, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, వికారాబాద్ తదితర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

సోమవారం ఉపరితల ఆవర్తనం నైరుతి, దాని పరిసరాల్లోని ఆగ్నేయ బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టం నుంచి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు మధ్య కొనసాగుతుందని వివరించింది. దీంతో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ.. ప్రయాణాలు, పనులు చేసుకోవాలని వెల్లడించింది. వాతావరణ శాఖ వర్ష సూచనలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# సాయిబాబాను దర్శించుకున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు



రాజన్న సిరిసిల్ల, జులై 3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం తిప్పాపూర్ లోని అయ్యప్ప స్వామి ఆలయంలోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు లక్ష్మీ నరసింహారావు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల జీవితాలు వెలుగులు నిండాలని ఉండాలని ఆయనే ఆ సాయినాధుని వేడుకున్నట్టు తెలిపారు.

అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్ కొండదేవయ్య, పలువురు బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన డాక్టర్ చేన్నమనేని వికాస్ డాక్టర్ దీప



రాజన్న సిరిసిల్ల, జులై 3:(నేటి నిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరవుపెట మండలం మల్క పేట గ్రామం లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన సాదుపల్లి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని డాక్టర్ చేన్నమనేని వికాస్ డాక్టర్ దీప దంపతులు సోమవారం రోజున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడి కుటుంబానికి 10.000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే నాగారం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదం మరణించిన మేకల నరేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. భవిష్యత్తులో మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి వెంట వెంట సురేందర్ రావు,రామచంద్రం,బాలాజీ,ప్రభాకర్ తిరుపతి ,నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి,లచ్చిరెడ్డి మరియు గ్రామ నాయకులు ,యువకులు ఉన్నారు

# హైదరాబాద్‌లో తమ మొట్టమొదటి కెరీర్ డిస్కవరీ డే నిర్వహించిన వరల్డ్ వైడ్ టెక్నాలజీ ఇండియా




హైదరాబాద్, జులై 3:గ్లోబల్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన వరల్డ్ వైడ్ టెక్నాలజీ, ఈరోజు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతదేశంలో మొట్టమొదటిసారిగా కెరీర్ డిస్కవరీ డేని నిర్వహించింది. హైస్కూల్ విద్యార్థులు వివిధ కెరీర్ ఎంపికలను అన్వేషించడానికి, వివిధ రంగాలలోని నిపుణుల నుండి సూచనలను పొందేందుకు మరియు నేడు అందుబాటులో ఉన్న అనేక అవకాశాల మధ్య వారి భవిష్యత్తు గురించి తగిన సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది. భారతదేశంలో డబ్ల్యుడబ్ల్యుటి యొక్క కమ్యూనిటీ కార్యక్రమాలకు విద్యకు తగిన అవకాశాలు ఒక ప్రధాన సిద్ధాంతం. కెరీర్ డిస్కవరీ డే వంటి కార్యక్రమాలు విద్యార్థులకు వారి ఆసక్తులు మరియు బలాలపై లోతైన అవగాహన ఆధారంగా భవిష్యత్ కెరీర్ మార్గాల గురించి సమాచారం తీసుకునేలా చేస్తుంది. రోజంతా, విద్యార్థులకు ఫస్ట్-హ్యాండ్ ప్రాక్టికల్ అనుభవాన్ని పొందడానికి, అపోహలను సవాలు చేయడానికి మరియు విభిన్న పరిశ్రమల నుండి నిపుణులతో అర్థవంతమైన చర్చలను చేయటానికి, వివిధ కెరీర్‌లు మరియు పని వాతావరణాలపై పరిజ్ఞానం పొందేందుకు వీలు కల్పించారు. ఈ సందర్భంగా వరల్డ్ వైడ్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ - గ్లోబల్ హ్యూమన్ రిసోర్సెస్, ఆన్ మార్ మాట్లాడుతూ, "వరల్డ్ వైడ్ టెక్నాలజీ ఎల్లప్పుడూ వ్యక్తులను కీలకమైన ఆస్తిగా పరిగణిస్తుంది మరియు మా ఈ అభిప్రాయం సంస్థను దాటి మా స్థానిక కమ్యూనిటీలకు కూడా విస్తరించింది. హైదరాబాద్ మరియు దేశంలోని ఇతర ప్రాంతాలలో మా కమ్యూనిటీ-ఇంపాక్ట్ ప్రోగ్రామ్‌ల గురించి మేము చాలా గర్వపడుతున్నాము, ఇవి 3,000 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయని మరియు వారు విజయవంతం కావడానికి అవసరమైన సాధనాలతో వారిని సన్నద్ధం చేయాలని భావిస్తున్నారు. సమానత్వం కోసం అత్యంత శక్తివంతమైన మార్గం విద్య మరియు విద్యార్థులకు ఈ వనరులను అందించడం వలన వారు కోరుకున్న భవిష్యత్తును సృష్టించుకోవచ్చు..." అని అన్నారు.

# 75 ఏళ్లలో సాధ్యం కానిది.. సీఎం కేసీఆర్ ఒక్క రోజులోనే చేసి చూపించారు: మంత్రి సత్యవతి



హైదరాబాద్, జులై 3: 'పోడు రైతులకు హక్కులు కల్పించేందుకు పోడు హక్కుల చట్టం ఏర్పాటు చేశారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్ర ఇప్పటివరకు గత ప్రభుత్వాలు 3లక్షల ఎకరాలకు పట్టాల చేశాయి. కానీ, సీఎం కేసీఆర్ 9ఏళ్ల పరిపాలనలోనే ఒకే రోజు 4.60లక్షల ఎకరాల పోడు పట్టాలను గిరిజనులకు అందించారు' అని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సమ్మక్క సారక్క తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో కలెక్టర్ ఎస్ క్రిష్ణ ఆదిత్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ములుగు జిల్లాకు చెందిన పోడు సాగుదారులకు హక్కుపత్రాలు, జిల్లాలో ప్రభుత్వ నిషేధిత సంస్థల్లో పని చేస్తూ లొంగిపోయిన కుటుంబాలకు ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మొదట సేవాలాల్, కుమ్రంభీం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఓఎస్డీ అశోకుమార్, గ్రంథాలయ చైర్మన్ గోవింద్ నాయక్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్ల బుచ్చయ్య, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్‌తో కలిసి పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం.. పోడు భూములకు హక్కుపత్రాలను అందిస్తూ రైతుబంధు, రైతుబీమా పథకాలను వర్తింపజేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపట్టిన పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చూస్తుంటే మేడారం మహాజాతరను తలపిస్తున్నదని అన్నారు. అర్హులైన ప్రతి సాగుదానికి హక్కు పత్రం అందాలనే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గిరిజన రైతులకు పోడు పట్టాలను అందించడంతోపాటు అర్హులైన గిరిజనేతర రైతులకు సైతం పట్టాలు కచ్చితంగా ఇవ్వాలని ప్రభుత్వానికి ములుగు కలెక్టర్ క్రిష్ణ ఆదిత్య సూచించారంటూ కొనియాడారు. ప్రభుత్వం నిర్ణయంతో గిరిజనులకు ఎన్నో ఇబ్బందులు తప్పాయన్నారు. సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో తీసుకున్న నిర్ణయాల కారణంగానే పట్టాల పంపిణీ జరుగుతోందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా ఒకే సమయంలో తెలంగాణలో 1.50లక్షల కుటుంబాలకు లబ్ధికలిగేలా 4.60లక్షల ఎకరాలకు హక్కుపత్రాలను అందించారని మంత్రి వివరించారు.

# సాయి బాబా సేవలో కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జులై 3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తిప్పాపురం, అయ్యప్ప ఆలయాలలో కొలువైన సాయిబాబాను గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబాకుఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాలలో భక్తుల కోసం నిర్వహించిన సేవా కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, కూరగాయల కొమరయ్య, సంఘ స్వామి యాదవ్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేష్, నిత్యానందరావు, నాగుల విష్ణు ప్రసాద్, నాగుల మహేష్ చిరంజీవి, రవి, రాజేష్ గౌడ్ పరుశరాములు గౌడ్, నక్క సాయి వీరితోపాటు ఆలయ కమిటీ నాయకులు వారాల దేవయ్య, కొండా దేవయ్య, వెంకటేశం, తదితరులు ఉన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM-XXVII ADDL. CHIEF JUDGE: C.C.C. AT SECUNDERABD
O.P.NO 520 of 2022
Between;
Bokka Muthyam Reddy ...Petitioner
AND
Mr.Bandi Santhosh Kumar & Another ...Respondents.
TO.
1.Mr. Bandi Santhosh Kumar, S/o. B. Dasu (Owner-cum-Driver)
Aged about: Major
Occ: Business,
R/o. Road No.9, H.No.102/2, S.V. Nagar, Opp.Vijaya Hospital, Nagaram, Keesara, Medchal Dist, T.S-500 062.
NOTICE
Please take notice that in the above matter the Petitioner had filed a case against you (Respondent No.1) for compensation for Rs.4,00,000/- and the same is posted for your appea rance on **10-07-2023.**
You are advised to appear on **10-07-2023** at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.
( By the order of the court )
**M/s. BANDI KALAVATHI REDDY (TS/1917/2012) GODUGU KRISHNA**
Advocates
#H.No.12-11-1556/AB, Flat No.001, Harika Enclave, Boudha Nagar, Warasiguda, Secundrabad-61.
Cell: 7675975689 9959858035

# భూ వివాదంలో ఇరువురికి గాయాలు

నిజామాబాద్, జులై 3:మండలంలోని భూనీపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇరువురు భూమి విషయంలో గొడవపడి ఒకరినొకరు కొట్టుకొని తీవ్రరక్త స్రవంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నరు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఒకే కుటుంబానికి చెందిన ఉరడి రమేష్, ఉరడి కాశిరం, ఉరడి స్వామి వీరి యొక్క ఆడపడుచులకు చెందిన లింగంపల్లి గ్రామ శివారులో గల ఎకరం నర భూమి విషయంలో ఆడపడుచు అల్లుడు ఉరడి శ్రవణ్ తమకు రావాల్సిన భూమి తమకు పట్టా చేయాలని కోరగా ఆదివారం రాత్రి రమేష్, శ్రవణ్ లు మాట మాట పెరిగి కట్టెలతో కొట్టుకున్నట్లు తెలిసింది.

ఇరువురికి గాయాలు కాగా ఆనువత్రికి తరలించినట్టు తెలిపారు.దీనిపై పోలీసులను వివరణ కోరగా ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సాయిబాబాకు బీఆరెస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, జులై 3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ సాయి బాబా ఆలయాలలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆరెస్ సీనియర్ నాయకుడు ఏనుగు ఏనుగు మనోహర్ రెడ్డి సాయిబాబాను దర్శించుకొని, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాల్గొన్నారు. ఆయన వెంటమాజీ ఎంపీటీసీ అయిలవేణి రాజేందర్, కొండ కనుకయ్య, రామారావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, విజయ్, పొన్నం రవిచంద్ర, అనిల్ భగవాన్, మహేష్ గౌతమ్ రవి తదితరులు ఉన్నారు.

# మీ కాఫీ కోరికలను వెలికితీయండి: కెఫిన్-ప్యాక్డ్ ఎక్స్ట్రావాగాంజా కోసం హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో నూతన ఔట్ లెట్ ప్రారంభించిన థర్డ్ వేవ్ కాఫీ

హైదరాబాద్, జులై 3: అసాధారణమైన రుచుల మిశ్రమంతో పాటుగా విభిన్నమైన జీవనశైలి అనుభవాలతో కాఫీ ప్రియులను ఆకట్టుకుంటూ థర్డ్ వేవ్ కాఫీ (ంచిఅ) తన తాజా కేఫ్‌ను హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ప్రారంభించినట్లు వెల్లడించింది. ఇనార్బిట్ మాల్ మొదటి అంతస్తులో ఉన్న, కొత్త థర్డ్ వేవ్ కాఫీ కేఫ్ యాక్సెసిబిలిటీ మరియు స్టైల్‌ను మిళితం చేస్తుంది. బహిరంగ ముఖంగా మరియు ఆహ్వానించదగిన సీటింగ్ ఏర్పాట్లతో, ఇది ప్రత్యేక కాఫీ కళలో మునిగిపోయేలా సందర్శకులను ఆహ్వానిస్తుంది. లోపలికి అడుగు పెట్టండి మరియు ఆహ్లాదకరమైన మరియు స్వాగతించే వాతావరణాన్ని అనుభవించండి, సమకాలీన అంశాల ను కాలాతీత తో నైపుణ్యంగా మిళితం చేయండి. తాజాగా తయారుచేసిన కాఫీ యొక్క సువాసన మరియు సుతిమెత్తని మెలోడీలు అసాధారణ మైన కాఫీ ప్రయాణానికి వేదికగా నిలిచాయి.వరుణ్ కపూర్, ఆపరేషన్స్ డైరెక్టర్ మరియు కాఫీ మావెరిక్, ఈ విశేషమైన వెంచర్ గురించి తన ఉత్సాహాన్ని వెల్లడిస్తూ "హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లోని మా కొత్త కేఫ్ ఒక ప్రత్యేకమైన మరియు ఆనందించే కాఫీ అనుభవాన్ని అందిస్తుంది. ఇది విశ్రాంత అనుభవాలు అందించటం మాత్రమే కాకుండా యాక్సెసిబిలిటీ, సౌలభ్యం మరియు ప్రీమియం సేవను కలిగి ఉంది.." అని అన్నారు ఈ కొత్త కేఫ్‌ను ప్రారంభించటం మాత్రమే కాదు; ఇది శక్తి మరియు ఆవిష్కరణల కలయిక. థర్డ్ వేవ్ కాఫీ మరియు ఇనార్బిట్ మాల్‌లు తమ ప్రత్యేక బలాలను ఒకచోట చేర్చి మరపురాని కెఫిన్-ప్యాక్డ్ కోలాహలం సృష్టించాయి . ఇనార్బిట్ మాల్ యొక్క ప్రీమియం బ్రాండ్ మిక్స్ మరియు రద్దీగా ఉండే ఫుట్ ట్రాఫిక్‌తో పాటు, అసాధారణమైన బ్రూలను రూపొందించడంలో థర్డ్ వేవ్ కాఫీ యొక్క నిబద్ధతతో , ఈ సహకారం అద్భుతమైన రుచుల సమ్మేళనాన్ని మరియు స్టైలిష్ వైబ్‌లను అందిస్తుంది.

# రైలు ఢీకొని యువకుడు మృతి

మెదక్, జులై 3:నేటినిజం (ప్రతినిధి):వెల్దుర్తి రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసు కుంది బంధువులు రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మా సాయిపేట గ్రామానికి చెందిన పోతన పల్లి బాబు 26 మాసాయిపేట రైల్వే బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని తల మండెం వేరువేరుగా పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు

IN THE COURT OF THE HON'BLE MACT-CUM-V ADDL. DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT AT L.B. NAGAR
O.P. NO 125 OF 2021
Between:
**Vadla Ravi Kumar and Others** ...Petitioners
And
**P. Bala Goud & others** ...Respondents
To
1. P. Bala Goud, S/o. P. Sathaiah Goud, Age 38 years, Occ: Driver, R/o. Railapur Village, Girmapur Medchal Mandal, Medchal Malkajgiri District.
Take notice that the Petitioners herein have filed the O.P. against you and 2 others for claiming compensation due to death of vadla Rahul in a road accident. The above said O.P. is posted to **20.07.2023** for your appearance. Hence you are hereby required to appear before this Hon'ble Court on **20.07.2023** at 10.30 AM by person or through an Advocate, failing which the matter will be decided on merits.
(BY ORDER OF THIS HON'BLE COURT)
**C. VENU GOPAL REDDY**
Advocate.
H.No. 8-2-94/8, Road No.3 Shakthi Nagar, L.B. Nagar post Hyderabad-74.
Ph: 9849902660

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com